E-KABURU E-PAPER


# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 16-8-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

# దేశానికి కవచంలా సుదర్శన చక్రం



తరువాయి 2లో

- శ్రీకృష్ణుడి స్ఫూర్తితో ఏర్పాటు
- 2035 నాటికల్లా సిద్ధం
- దేశంలోని అన్ని ప్రధాన వ్యవస్థలకూ దీనితో రక్షణ
- రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలను అంగీకరించబోం
- యువత ఉపాధికి రూ.లక్ష కోట్లతో పథకం
- మళ్లీ దుస్సాహసం చేస్తే పాక్‌కు చావు దెబ్బే
- దీపావళిలోపు జీఎస్టీలో సంస్కరణలు తెస్తాం
- ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన

ఈ కబురు, దిల్లీ: శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ కవచంతో కీలకమైన వ్యవస్థలకు రక్షణ కల్పిస్తామని, దేశాన్ని శత్రు దుర్భేధ్యంగా తయారు చేస్తామని ఉద్ఘాటించారు. 2035నాటి కల్లా ఈ కొత్త భద్రతా వ్యవస్థ పనిచేయడం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడి ఎర్రకోట బురుజులపై 12వసారి త్రివర్ణపతాకాన్ని ఎగరవేసిన అనంతరం ప్రధాని మోదీ జాతినుద్దేశించి 103 నిమిషాలు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ నుంచి అంతరిక్షం దాకా అన్ని రంగాలనూ ఆయన స్పృశించారు. ప్రతి రంగంలో ఆత్మనిర్భరత సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చే దీపావళి నాటికి జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చి సామాన్యులపై పన్నుల భారం తగ్గిస్తామని ప్రధాని కీలక ప్రకటన చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులను అభినందించారు.

## ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపితేనే.. రష్యాతో వ్యాపారం: ట్రంప్


వాషింగ్టన్ డీసీ,ఈ కబురు: మరికొన్ని గంటల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలాస్కా వేదికగా భేటీకానున్నారు. సమావేశం కోసం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో బయల్దేరే ముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు.



తరువాయి 3లో

## నేడు, రేపు అతి భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఆరెంజ్, యెల్లో అలెర్ట్‌ల జారీ..
ఈ నెల్లో ఇప్పటివరకు 16.7 సెం.మీ. వర్షపాతం
కృష్ణాలో భారీగా.. గోదావరి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద
2 వేల మిలియన్ యూనిట్లు దాటిన జలవిద్యుదుత్పత్తి



తరువాయి2లో

## నీటి వాటాల్లో రాజీ పడం

- ఒత్తిడికి లొంగం.. కుట్రలకు బెదరం.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన
- రైతులకు 1.13లక్షల కోట్లు ఖర్చు పెట్టాం.. పేదల సొంతింటి కలను నెరవేర్చాం
- తెలంగాణ రైజింగ్2047ను పూర్తి చేయడమే లక్ష్యం
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గోల్కొండ కోటలో అట్టహాసంగా వేడుకలు



హైదరాబాద్, ఈ కబురు: గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను సాధించడంలో రాజీ పడే సమస్యే లేదని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రజల భావోద్వేగం, పేగు బంధం... సాగు నీటి ప్రాజెక్టులని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి చుక్కను సాధిస్తామన్నారు. ఎవరి ఒత్తిడికి లొంగబోమని, ఎవరి కుట్రలకు బెదరబోమని స్పష్టం చేశారు. 4 కోట్ల మంది ప్రజల పక్షాన నిటారుగా నిలబడి కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను సాధించుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.

తరువాయి 2లో

## కాళేశ్వరంపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్!




- ప్రాజెక్టు పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా.. తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేలా ప్రయత్నం
- హరీశ్‌రావు, వినోద్‌కుమార్‌తో కేసీఆర్ భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై చర్చ

తరువాయి 2లో

## సూపర్‌సిక్స్ సూపర్ హిట్



- సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థమిచ్చాం
- 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- రూ.10 వేల కోట్లతో తల్లికి వందనం
- అన్నదాతల ఖాతాల్లో 3,173 కోట్లు జమ
- 2,684 కోట్లతో 2 కోట్ల రాయితీ సిలిండర్లు
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

అమరావతి, ఈ కబురు: సంక్షేమం అభివృద్ధి సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలుకాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని ప్రకటించారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు, ప్రపంచంలోని తెలుగువారందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు. అభివృద్ధికి అడ్డులేదు.. సుపరిపాలనకు పోటీ లేదు. ఇది రికార్డు..

తరువాయి 3లో

## కేసీఆర్ వద్దకు కవిత



» 3లో

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా



## పెట్టుబడులు పెట్టండి.. లాభాలు ఇప్పించే బాధ్యత నాది





- పెట్టుబడుల రక్షణే కాదు.. లాభాలొచ్చేలా ప్రోత్సాహం
- పాలకులు మారినా ప్రభుత్వ పాలసీలు మారకూడదు
- ఫ్యూచర్ సిటీ అంటే... రేవంత్ రెడ్డి గుర్తొచ్చేలా నిర్మిస్తా
- జైపాల్ రెడ్డి చొరవతోనే హైదరాబాద్‌కు మెట్రో రైలు
- పదేళ్లుగా మెట్రో విస్తరణ లేనందుకే ట్రాఫిక్ సమస్యలు
- మేము వచ్చాక ఎల్బీనగర్‌ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన
- శామీర్‌పేట, మేడ్చల్ దాకా నిర్మాణానికి నిర్ణయం
- గత సర్కార్ కాళేశ్వరం కోసం 11.5% వడ్డీకి అప్పు
- నేనొచ్చాక 26 వేల కోట్లను 7.5% వడ్డీకి మార్పించా
- 2లక్షల కోట్ల రుణాన్ని రీస్ట్రక్చర్ చేయాలని కోరుతున్నా
- ప్రాజెక్టుల అనుమతుల కోసమే పదే పదే ఢిల్లీకి

హైదరాబాద్ సిటీ,ఈ కబురు: ''ప్రభుత్వ విధానాలు, నిర్మాణ రంగం.. అనేవి రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్ లాంటివి. యూఎస్, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, దుబాయ్ వంటి దేశాలకు వెళ్లి.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని విదేశీయులను కోరుతున్న మేము.. ఇక్కడే ఉన్న పెట్టుబడిదారులను ఎందుకు వదులుకుంటాం? పెట్టుబడుల విషయంలో మా మొదటి ప్రాధాన్యం మీకే ఉంటుంది'' అని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, క్రెడాయ్ నిర్వాహకులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలకులు మారినా ప్రభుత్వ విధానాలు మారకూడదని, ఆ విధానాన్ని తాము పాటిస్తున్నందునే ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామని తెలిపారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత కూడా తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు సృష్టించే అపోహలకు ఊతమిస్తే నష్టపోయేది వ్యాపారులేనన్నారు. ప్రభుత్వం తరఫున అలాంటి వాటిని తొలగించడానికే తాను ఇక్కడికి వచ్చినట్లు స్పష్టం చేశారు. అభినందించారు.

తరువాయి 2లో


పుట్టిన 10 రోజులకే అన్న చనిపోయాడు.. అమ్మ ఆస్పత్రికే వెళ్లలేదు: కంగనా రనౌత్ » 5లో



అప్పుల కుప్ప అమెరికా » 4లో



'అమ్మ' ప్రెసిడెంట్‌గా శ్వేతా మేనన్.. తొలి నటిగా రికార్డు » 5లో



అప్పుడు సచిన్ ఆపాడు..: సెహ్వాగ్ » 6లో



మొదటి పేజీ తరువాయి

# దేశానికి కవచంలా 'సుదర్శన చక్రం'




వారికి సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్తులో పాకిస్థాన్ మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే భారత సైన్యం చేతిలో చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. అణు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. యువత ఉపాధి కల్పనకోసం రూ.లక్ష కోట్లతో ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)పై ప్రధాని తన ప్రసంగంలో ప్రశంసల వర్షం కురిపించారు. ఆత్యయికస్థితిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 50 ఏళ్ల క్రితం రాజ్యాంగం గొంతు నొక్కి ఆత్యయికస్థితి ద్వారా దేశాన్ని జైలుగా మార్చిన పాపులను దేశప్రజలు ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. ఇంకా ప్రసంగంలో ఏమన్నారంటే... దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ. చిత్రంలో అమిత్ షా సతీమణి సోనాల్ షా

**ఉగ్ర సౌధాలను తుత్తునియలు చేశాం**

ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన పరాక్రమవంతులకు ఎర్రకోట బురుజులపై నుంచి వందనం చేసే అవకాశం లభించినందుకు గర్వపడుతున్నా. మన వీర సైనికులు శత్రువుకు ఊహించని విధంగా శిక్ష విధించారు. ఏప్రిల్ 22న ఉగ్రవాదులు సరిహద్దులు దాటి వచ్చి సామాన్యులను దారుణంగా హత్యచేశారు. ఆ ఘటనతో దేశం మొత్తం ఆక్రోశం నిండిపోయింది. దానికి ప్రతిరూపమే ఆపరేషన్ సిందూర్. 22వ తేదీ తర్వాత మేం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాం. రణనీతి, లక్ష్యం, సమయం అన్నీ వారే నిర్ణయించుకొని వందల కిలోమీటర్లు శత్రుభూమిలోకి దూసుకుపోయి ఉగ్రవాదులను మట్టిలో కలిపారు. ఉగ్రసౌధాలను తుత్తునియలు చేశారు. దాంతో ఇప్పటికీ పాకిస్థాన్ ఉలిక్కిపడుతోంది.

**వస్తోంది సురక్షా కవచం**

రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటుచేస్తాం. ప్రధానమైన ప్రభుత్వ వ్యవస్థల నుంచి ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లవంటి పౌర సేవలు అందించే కేంద్రాలవరకూ అన్నింటికీ రక్షణ కల్పిస్తాం. ఇందుకోసం భగవాన్ శ్రీకృష్ణుని నుంచి ప్రేరణ తీసుకొని ఆయన ధరించిన సుదర్శన చక్ర మార్గాన్ని ఎంచుకున్నాం. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రంతో సూర్యప్రకాశాన్ని ఆపేసి పగలే చీకటి సృష్టించారు. అప్పుడు అర్జునుడు తన ప్రతిజ్ఞ ప్రకారం జయద్రథుడిని వధించగలిగాడు. ఆ స్ఫూర్తితోనే సుదర్శన్ చక్ర మిషన్ ప్రారంభిస్తున్నాం. ఇది శత్రువుల దాడిని నిర్వీర్యం చేయడంతోపాటు ఎన్నో రెట్ల బలంతో వారిపై ప్రతిదాడి కూడా చేస్తుంది. ఇందుకు అవసరమైన సాంకేతిక వ్యవస్థల పరిశోధన, అభివృద్ధి, తయారీ మన దేశంలోనే, మనవారితోనే తయారుచేయబోతున్నాం. కృష్ణుడి సుదర్శన చక్రం లక్ష్యాన్ని ఛేదించిన తర్వాత తిరిగి ఆయనవద్దకే వచ్చేది. మేం కూడా అంతే కచితత్వంతో ఈ వ్యవస్థను రూపొందిస్తాం. దిల్లీలోని ఎర్రకోట వద్ద త్రివిధ దళాల కవాతు

3.5 కోట్ల మందికి ఉద్యోగావకాశాలుఈ దేశ యువత కోసం ఓ సంతోషకరమైన వార్త తీసుకొచ్చాను. ఈ ఆగస్టు 15 నుంచే యువత కోసం రూ.లక్ష కోట్ల పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈరోజు నుంచి ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ఇక్కడినుంచే మొదలుపెడుతున్నాం. దీనిద్వారా ప్రైవేటురంగంలో తొలిసారి ఉద్యోగం పొందిన యువతకు ప్రభుత్వం నుంచి రూ.15 వేలు ఇస్తాం. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. ఈ పథకం దాదాపు 3.5 కోట్ల మంది యువతకు కొత్త ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇంధనరంగంపై విస్తృత స్థాయిలో దృష్టి సారించాం. గ్రీన్ హైడ్రోజన్‌పై వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నాం. 2047కల్లా మన అణుఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 రెట్లకుమించి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సంస్కరణల వేగాన్ని పెంచాలని నిర్ణయించాం. భవిష్యత్ తరం సంస్కరణల కోసం ఓ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీంతో యువతకు, ఎంఎస్ఎంఈ సంస్థలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేలు జరుగుతుంది. రైతులు, మత్స్యకారులు, పశుపాలకులు మన ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనందిస్తున్నారు. వారి ప్రయోజనాలకు విరుద్ధమైన ఎలాంటి విధానాలనూ మేం అంగీకరించం. వారికి హాని కలిగించే విధానాలను అడ్డుకొనే గోడలా నిల్చున్నా. దేశంలో స్థూలకాయం పెరిగిపోతుండటం ఆందోళనకరం. దీని గురించి ప్రతి కుటుంబం ఆలోచించాలి. రాబోయే రోజుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు స్థూలకాయం బారిన పడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాన్నుంచి మనం బయటపడాలి. అందుకోసం ఇంటి అవసరాలకు తీసుకొచ్చే వంటనూనెలో 10% తగ్గించుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ దేశాన్ని తీర్చిదిద్దడంలో వ్యక్తులతో పాటు సంస్థల శ్రమ కూడా దాగి ఉంది. ఇప్పటికి 100 ఏళ్లకు ముందు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనే సంస్థ ఏర్పడింది. వ్యక్తి నిర్మాణం ద్వారానే దేశ నిర్మాణం సాధ్యమవుతుందన్న సంకల్పంతో ఆ సంస్థకు చెందిన లక్షల మంది స్వయం సేవకులు మాతృభూమి కోసం తమ జీవితాలను సమర్పించారు. వారందరినీ ఈ ఎర్రకోట నుంచి గౌరవపూర్వకంగా స్మరించుకుంటున్నాను.


కొందరు దుర్బుద్ధితో దేశ జనాభా స్వరూపాన్ని (డెమోగ్రఫీ) మార్చేందుకు ప్రయత్నిస్తూ కొత్త సంకటానికి బీజం వేస్తున్నారు. చొరబాటుదారులు ఈ దేశ యువత ఉద్యోగాలను, ఉపాధిని లాగేసుకుంటున్నారు. ఆదివాసీల భూములను కబ్జా చేస్తున్నారు. దీన్ని దేశం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించదు. సరిహద్దు ప్రాంతాల్లో డెమోగ్రఫీలో మార్పు వస్తే దేశ భద్రతకే ముప్పు. అందుకే హైపవర్డ్ డెమోగ్రఫీ మిషన్ ప్రారంభించాలని నిర్ణయించాం. తద్వారా భారత్‌కు ఎదురయ్యే సంకటాన్ని నిర్మూలించేందుకు కార్యాచరణ మొదలుపెడతాం. మోదీ

దీపావళికి శుభవార్త

రాబోయే దీపావళి రెట్టింపు వెలుగునిచ్చేలా చేయబోతున్నాం. దేశ ప్రజలకు పెద్ద బహుమతి లభించబోతోంది. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జీఎస్టీపై ఉన్నతస్థాయి కమిటీ వేసి సమీక్షిస్తున్నాం. రాష్ట్రాలతో మాట్లాడుతున్నాం. దీపావళిలోపు జీఎస్టీ సంస్కరణలు తీసుకురాబోతున్నాం. సాధారణ ప్రజలకు పన్నుభారం చాలావరకు తగ్గించబోతున్నాం. రోజువారీ వినియోగవస్తువులు చాలా చౌక అవుతాయి.

మొదటి పేజీ తరువాయి

# పెట్టుబడులు పెట్టండి.. లాభాలు ఇప్పించే బాధ్యత నాది



హైటెక్స్‌లో శుక్రవారం క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాపర్టీ షోను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను సగటు మధ్యతరగతి ఆలోచనలు ఉన్న ముఖ్యమంత్రిని అని, ఇక్కడి సంపద కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న దృక్పథం తనకు లేదని స్పష్టం చేశారు. సమాజ శ్రేయస్సు కోసమే తాను ఆలోచిస్తానని, కొన్ని సందర్భాల్లో వ్యాపారులు అడిగినవన్నీ అంగీకరించలేకపోవచ్చన్నారు. పారదర్శక విధానంలో ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధికి సహకరించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ''చార్మినార్‌ను కులీ కుతుబ్ షా నిర్మించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగింది. హైటెక్ సిటీని చంద్రబాబు అభివృద్ధి చేశారు. వారి గురించి మనం గొప్పగా చెప్పుకుంటున్నాం.. వారిని గుర్తు చేసుకుంటున్నాం.. రానున్న రోజుల్లో ఫ్యూచర్ సిటీ అంటే రేవంత్ పేరు గుర్తుకు వచ్చేలా నిర్మిస్తాం. వచ్చే వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకొనేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పం. నాకు ఆ చిత్తశుద్ధి, తపన ఉంది. అందరం కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం'' అని క్రెడాయ్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో ఉండేటోళ్లు మెట్రో ఎక్కుతారా?''కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి చొరవతో హైదరాబాద్‌కు మెట్రో వచ్చింది .. పదేళ్లుగా మెట్రో విస్తరణ జరగలేదు.. అలా జరిగి ఉంటే ఈ రోజు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య కొంతైనా పరిష్కారమయ్యేది'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ''గత ప్రభుత్వ హయాంలో హైటెక్‌సిటీ నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు దాకా మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. కానీ.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉన్న వారు ఎంత మంది మెట్రో ఎక్కుతారు? ఇక్కడి నుంచి ఔటర్ మీదుగా వెళ్లినా అదే వేగంతో ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. మల్టీ యుటిలిటీ ట్రాన్స్‌పోర్ట్ అనేది జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల మీదుగా ఉండాలి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్బీనగర్ నుంచి చాంద్రాయణ గుట్ట, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కొత్తగా 100 ఎకరాల్లో నిర్మిస్తున్న హైకోర్టు సమీపం నుంచి శంషాబాద్, ఎయిర్‌పోర్టు దాకా మెట్రో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అలాగే, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు, కూకట్‌పల్లి తర్వాత మియాపూర్, లింగంపల్లి మీదుగా పటాన్‌చెరు వరకు, హైటెక్ సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మీదుగా కోకాపేట దాకా మెట్రో పొడిగించాలని అధికారులకు చెప్పా. అలాగే, ఇటు శామీర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో విస్తరించాలని భావిస్తున్నాం'' అని వివరించారు. రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం 200 ఎకరాలను ఇచ్చేలా రక్షణ శాఖను ఒప్పించామని గుర్తు చేశారు. శామీర్‌పేట, మేడ్చల్ ప్రాంతాలు.. వేగంగా విస్తరిస్తున్నాయని, మెరుగైన కనెక్టివిటీ ఉండేలా వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ''నేను మాటి మాటికి ఢిల్లీ వెళ్తున్నానంటూ కొందరు మాట్లాడుతున్నారు. కానీ.. ఢిల్లీలో ముఖ్యమంత్రికి బంగళా ఇచ్చింది నెలకు నాలుగు రోజులు వెళ్లి కేంద్రంతో అనుమతులు తెచ్చుకోవడానికే. దాన్ని నేను సద్వినియోగం చేసుకుంటున్నా'' అని అన్నారు. మెట్రో, మూసీ రివర్‌ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టుల అనుమతుల కోసమే తరచుగా ఢిల్లీ వెళ్లాల్సి వస్తోందని వివరించారు.

రూపాయి ఖర్చు పెడితే 42 పైసలే వస్తోంది

''కాళేశ్వరం కార్పొరేషన్ పేరిట గత పాలకులు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. 12 ఏళ్లకు 11.5 శాతం వడ్డీకి రుణాలు తీసుకున్నారు. ఎంత వ్యాపారం చేసేటోళ్లైనా 11.5 శాతానికి అప్పులు తెస్తరా? నేను వచ్చిన 20 నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అప్పుల్లో అసలు, వడ్డీ కలిపి రూ.29వేల కోట్లు చెల్లించాను. వాస్తవానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపాయి ఖర్చు పెడితే 42 పైసలే తిరిగి వస్తోంది. రాష్ట్రంపై అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాన మంత్రిని పలు మార్లు కలిశాను. ఇప్పటికే రూ.26వేల కోట్లను 7.5 శాతం వడ్డీకి 35 ఏళ్లకు రీ స్ట్రక్చర్ చేయించా. మొత్తం రూ.2 లక్షల కోట్ల రుణాలను రీ స్ట్రక్చర్ చేయాలని ప్రధానిని కోరుతున్నా'' అని సీఎం రేవంత్ వెల్లడించారు. ఇదంతా తన కోసం చేస్తున్నది కాదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాను తాపత్రయపడుతున్నానని తెలిపారు. మహారాష్ట్రలో 40 విమానాశ్రయాలున్నాయని, తెలంగాణకు మరిన్ని విమానాశ్రయాలు తెచ్చుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను డైనమిక్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా క్రెడాయ్ సభ్యులను ప్రోత్సహిస్తామన్నారు. ''గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన నేను పెద్ద పెద్ద ఇంగ్లీషు చదువులు చదువుకోకున్నా.. కామన్ సెన్స్ ఉంది. భాష అనేది కేవలం ఒక కమ్యూనికేషన్ మాత్రమే'' అని పేర్కొన్నారు.

# కేసీఆర్ వద్దకు కవిత

ఈ కబురు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ వద్దకు వెళ్లారు. తన చిన్న కుమారుడు ఆర్య గ్రాడ్యుయేషన్ చదివేందుకు అమెరికా వెళ్తున్న సందర్భంగా అతనికి తాత ఆశీర్వాదం ఇప్పించాలని కవిత భావించారు. ఈ మేరకు తన భర్త, ఇద్దరు కుమారులతో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లారు. ఆ సమయంలో కేసీఆర్ తన బెడ్రూంలో ఉన్నారు. కవిత మాత్రం బెడ్రూం బయటి నుంచే తన తండ్రికి నమస్కారం చేశారు. ఆ తర్వాత కేసీఆర్ సతీమణి శోభ.. మనుమడిని బెడ్రూంలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మనుమడు ఆర్యను ఆశీర్వదించిన కేసీఆర్ అతనితో పలు విషయాలు మాట్లాడారు. ''మంచిగా చదువుకో. ఏ కోర్సులో చేరుతున్నావు? యూనివర్సిటీ పేరేంటి? అమెరికా ఎప్పుడు వెళ్తున్నావు?'' అని కేసీఆర్ అడగగా.. ఆర్య అన్ని వివరాలు చెప్పి శుక్రవారం రాత్రి బయలుదేరి వెళుతున్నామని చెప్పినట్లు తెలిసింది. కాగా, కుమారుడిని అమెరికాలో కళాశాలలో చేర్పించేందుకు ఆయనతోపాటు తన పెద్ద కుమారుడు ఆదిత్యతో కలిసి కవిత శుక్రవారంరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఆమె తిరిగి సెప్టెంబరు 1న బయలుదేరి 2న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కవిత అమెరికా పర్యటనకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇవ్వడంతోపాటు పాస్‌పోర్ట్‌ను కూడా రిలీజ్ చేసింది.

శ్రీకాంతాచారి త్యాగం సదా స్మరణీయం

తన ఆత్మబలిదానంతో యావత్ తెలంగాణను స్వరాష్ట్ర సాధన ఉద్యమం వైపు నడిపించిన శ్రీకాంతాచారి త్యాగం సదా స్మరణీయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ప్రస్తుత ప్రభుత్వ పాలన నుంచి మన గడ్డను కాపాడుకోవడానికి శ్రీకాంతాచారి స్ఫూర్తితో పునరంకితమవుదామని ఆమె పిలుపునిచ్చారు. శ్రీకాంతాచారి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఆయన త్యాగాన్ని కవిత స్మరించుకున్నారు.



# మళ్లీ బానిసత్వంలోకి నెడుతున్న కాంగ్రెస్: కేటీఆర్



హైదరాబాద్,ఈ కబురు: కాంగ్రెస్ పాలకులు తెలంగాణను మళ్లీ బానిసత్వంలోకి నెడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ప్రతి చిన్న పనికి ఢిల్లీ వైపు చూడాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కేటీఆర్ ఈ మేరకు మాట్లాడారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల నిర్వాకం వల్ల సంక్షేమం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం వెనుకబడిపోయిందని, ఐటీ పరిశ్రమలు తరలిపోతున్నాయని కేటీఆర్ ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి

# నీటి వాటాల్లో రాజీ పడం



హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి బృహత్తర ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం, రూ.లక్ష కోట్లు గోదావరిలో కలవడం.. అన్నీ మన కళ్ల ముందే జరిగాయని ధ్వజమెత్తారు. అందుకే ఆ పార్టీ నాయకులు మరోసారి సెంటిమెంట్‌ను రగిల్చి.. రాజకీయ ప్రయోజనం పొందడానికి కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి బాధ్యత, అవగాహన ఉందని, ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చుకోవడానికి అవసరమైన ప్రణాళికలూ ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ, పాలమూరురంగారెడ్డి, డిండి వంటి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి, తెలంగాణను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. పూర్తి ప్రసంగం ఆయన మాటల్లోనే..

**సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన**

''గత ఉగాది నుంచి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.13 వేల కోట్లతో, 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. ఈ రోజు ధనికులతో సమానంగా పేదవారు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు. ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు. ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పథకం. రేషన్‌కార్డులు.. ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఒక భరోసా. ఇందుకోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఆ ఎదురు చూపులకు పరిష్కారం లభించింది. ఈ ఏడాది జూలై 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. పదేళ్ల తర్వాత పేదల సొంతింటి కలలకు మళ్లీ రెక్కలు తొడిగాం. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేశాం. ఇందుకోసం రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈ ఏడాదే 4.50లక్షల ఇళ్లు పూర్తి చేయబోతున్నాం. రాష్ట్ర రైతులకు ఇచ్చిన మాట ప్రకారం గత ఏడాది ఆగస్టు 15న రుణమాఫీకి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616కోట్ల మేర రుణాలను మాఫీ చేసి, కొత్త చరిత్రను లిఖించాం. 'ఇందిరమ్మ రైతు భరోసా' కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాం. ఇటీవల తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల సొమ్మును రైతుల ఖాతాల్లో వేశాం. 7,178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొన్నాం. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నదాతల సంక్షేమానికి రూ.1.13లక్షల కోట్లను ఖర్చు చేశాం.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు**

సమగ్ర కుల గణన సర్వే ఆధారంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని నిర్ణయించాం. ఈ మేరకు బిల్లులను రూపొందించగా, ఈ ఏడాది మార్చి 17న శాసనసభ ఆమోదించింది. బీసీ రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని కేంద్రాన్నీ కోరాం. అలాగే, దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణనే. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో అనేక చోట్ల వైద్య విద్యా కళాశాలలు నిర్మిస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఈ పథకం కింద ఆడబిడ్డలకు రూ.6,790 కోట్లు ఆదా అయ్యాయి. ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటడం మా విజయాల్లో మరో మైలురాయి. గత పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగింది. ఆ కుట్రను మేం ఛేదించాం. ఇవ్వాళ తెలంగాణలో డ్రగ్స్ మాట వినబడటానికి వీలు లేదు. 20 నెలల్లోనే దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే చర్యల్లో భాగంగా ఇటీవల ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించాం. 2047నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ చేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పం మాది. 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మహత్తర సంకల్పమే 'తెలంగాణ రైజింగ్ 2047'. హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, శుభ్రమైన, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలని మా ప్రభుత్వం భావిస్తోంది. ఆ ఆలోచన నుంచి ఏర్పాటైనదే హైడ్రా. చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను నిరోధించాలన్న ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకువచ్చాం. ఈ రోజు రూ.30వేల కోట్ల విలువైన భూములను హైడ్రా కాపాడింది. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ.. ఇవి నాకు రెండు కళ్లు. మన పిల్లల భవితకు ఇవి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయనడంలో సందేహం లేదు'' అని తెలిపారు.

**వారసత్వ అప్పు రూ.8,21,651 కోట్లు**

గత పాలకులు మాకు వారసత్వంగా రూ.8,21,651కోట్ల అప్పును మిగిల్చి వెళ్లారు. ఇందులో అప్పులు రూ.6,71,757 కోట్లు కాగా, ఉద్యోగులు, పథకాలకు సంబంధించిన బకాయిలు రూ.40,154కోట్లు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, సింగరేణి, విద్యుత్ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1,09,740కోట్లు. ఇంత ఆర్థిక భారం ఉన్నప్పటికీ శూన్యం నుంచి శిఖరానికి రాష్ట్రాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. 'మనసుంటే మార్గం ఉంటుంది' అనే సూక్తిని నేను విశ్వసిస్తాను. మాకు విల్ ఉంది... తెలంగాణ రైజింగ్ 2047 మా విజన్. ప్రపంచ వేదికపై తెలంగాణను నంబర్‌వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం. అంత వరకు విశ్రమించబోం.

# నేడు, రేపు అతి భారీ వర్షా లు!

ఈ కబురు: రాష్ట్రంలో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు రెండు రోజులకు పలు జిల్లాలకు ఆరెంజ్, యెల్లో అలెర్ట్‌లను జారీ చేసింది. శనివారం అన్ని జిల్లాల్లోనూ మోస్తరు వానలు పడతాయని.. ముఖ్యంగా ఆదిలాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జనగామ, కరీంనగర్, సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇటు ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెలంగాణవ్యాప్తంగా 167 మిల్లీమీటర్ల (16.7 సెం.మీ.) వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే ఈ 15 రోజుల సాధారణ వర్షపాతం 106 మిల్లీమీటర్లే.. అంటే సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం ఇప్పటివరకు నమోదైంది. అలాగే ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 15 వరకు సాధారణ వర్షపాతం 464 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 509 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుంటే.. గోదావరి ప్రాజెక్టులకు మాత్రం స్వల్పంగానే వస్తోంది. కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు శుక్రవారం 1.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 1.74 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నాగార్జునసాగర్‌కు 1.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... అంతే స్థాయిలో ఔట్ ఫ్లో ఉంది. సాగర్ 14 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు 1.55 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.67 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 15,380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... 19 వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జూరాలకు 1.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్ ఫ్లో 68 వేల క్యూసెక్కులుగా ఉంది. ఇక గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్ ఫ్లో 4,733 క్యూసెక్కులుగా ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 18 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్ ఫ్లో 10,578 క్యూసెక్కులుగా ఉంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా.. 28,857 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇటు నిర్మల్ జిల్లాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోంది. మధ్యాహ్నం వరకే ప్రాజెక్టులోకి 15,600 క్యూసెక్కుల వరద చేరింది. దీంతో ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ చేతుల మీదుగా పూజలు నిర్వహించి.. ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కులను విడిచిపెట్టారు. రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో ములుగు జిల్లాలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. దీంతో భారీగా పర్యాటకులు వచ్చి వీక్షిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల కింద శుక్రవారం రాత్రి నాటికి జలవిద్యుదుత్పాదన 2 వేల మిలియన్ యూనిట్లు దాటింది.

మొదటి పేజీ తరువాయి

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు



**రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం' కార్యక్రమానికి హాజరైన సీఎం స్పీకర్, మండలి ఛైర్మన్ సహా పలువురు ప్రముఖుల హాజరు**

హైదరాబాద్, ఈ కబురు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'ఎట్‌హోం' కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం సాయంత్రం ఇచ్చిన తేనీటి విందుకు సీఎం రేవంత్ , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, బండారు దత్తాత్రేయ, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. రాంచందర్ రావు, ఎంపీలు కె. లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.

శుక్రవారం గవర్నర్ పుట్టినరోజు కూడా కావటంతో.. సీఎం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ గీతాలాపన అనంతరం అతిథులు తేనీటి విందును స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన అతిఉథుల వద్దకు గవర్నర్, సీఎం ఇద్దరూ స్వయంగా వెళ్లి పలకరించారు. కాగా, ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి ఎవరూ హాజరుకాకపోవటం చర్చనీయాంశంగా మారింది.

# ఖాజాగూడలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



ముువన్నెల జెండాకు వందనం సమర్పిస్తున్న సాయిబాబా



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పలు ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించిన సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాలను సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమర యోధులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దారిగుపల్లి నరేష్, అంజమ్మ, రమేష్ గౌడ్, సతీష్ ముదిరాజ్, షామ్లేట్ శ్రీనివాస్, నరేష్ సింగ్, బిక్షపతి, ఆకుల యాదగిరి, తాహెర్, ఖాదర్ ఖాన్ తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంతోమంది త్యాగాల ఫలం మన స్వాతంత్రం : గంగల రాధాకృష్ణ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : మన దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, స్వాతంత్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని మాదాపూర్ డివిజన్ బిజెపి కాంటెస్టెంట్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ అన్నారు. భారత 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్, సాయినగర్, చంద్ర నాయక్ తండ, ఖానామెట్, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో స్థానికుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాలను రాధాకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ మన దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపడమే స్వాతంత్ర సమరయోధులకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీల ప్రజలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ముువన్నెల జెండాకు వందనం సమర్పిస్తున్న రాధాకృష్ణ యాదవ్

# గచ్చిబౌలి డివిజన్ లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలువేడుకలు



స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ప్రతి పౌరుడు దేశ సమైక్యతకు కృషి చేయాలి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారత 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల డివిజన్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక కాలనీవాసులు, డివిజన్ నాయకులు, బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన జాతీయ జెండాలను గంగాధర్ రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు దేశ సమైక్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెన్నెల జెండాను ఆవిష్కరించే అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# 'భారత్' స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగాలి : కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి భారత్ స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగేందుకు నేటి యువత కీలక భూమిక పోషించాలని 'జనంకోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, గౌతమి నగర్ కాలనీ అసోసియేషన్ సలహాదారుడు, విఆర్ రెసిడెన్సి అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా మంత్రంగా భారత్ స్వయం సమృద్ధితో.. అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. నేటి యువత తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ దేశ అభివృద్ధిలో భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నూనె సురేందర్, సాయికుమార్, నాగభూషణం, ఆదిశేషయ్య, అశోక్ కుమార్, నరసింహ, సుబ్బరాజు, త్రినాథ్, రామస్వామి, శ్రీనివాస్ రెడ్డి, అప్పి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

# కాళేశ్వరంపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్!



హైదరాబాద్, ఈ కబురు: కాళేశ్వరం కమిషన్ నివేదిక, దాని ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించిన అంశాలు, ఆ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. వీటిని తిప్పికొట్టేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆ పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక నేతలు హరీశ్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులతో ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో సమావేశమైనట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాకుండా.. నిలిచిపోయిన ఆ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకువచ్చేలా సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఈ సందర్భంగా కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది.న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్లాలని, ఇందుకు ఏయే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్న దానిపై పార్టీ నేతలకు గులాబీ బాస్ సూచనలు చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందంటూ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ తదితర అంశాలపై కూడా కేసీఆర్ సమాలోచన చేసినట్లు తెలిసింది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం, దాన్ని అధిగమించేందుకు ప్రజల్లోకి ఎలా వెళ్లాలన్నదానిపై కూడా అధినేత సూచనలు చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన ప్రణాళికలపైనా కేసీఆర్ చర్చించినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చూసుకుంటారని చెప్పినట్లు సమాచారం.

# ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపితేనే.. రష్యాతో వ్యాపారం: ట్రంప్

వాషింగ్టన్ డీసీ,ఈ కబురు: మరికొన్ని గంటల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలాస్కా వేదికగా భేటీకానున్నారు. సమావేశం కోసం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో బయల్దేరే ముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే వరకు రష్యాతో వ్యాపారాలు చేయబోమని స్పష్టం చేశారు. ''సమావేశానికి పుతిన్ కొంతమంది రష్యా వ్యాపారులను వెంటతీసుకొస్తున్నట్లు తెలిసింది. వాళ్లు అమెరికాతో వ్యాపారం చేయాలని భావిస్తున్నారు. ఇది చాలా మంచి విషయం. అయితే, ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికిన తర్వాతే వ్యాపారాల గురించి చర్చలుంటాయి. చర్చలు సాఫీగా సాగనిస్తే తప్పకుండా పురోగతి ఉంటుంది. లేదంటే చర్చలు తొందరగా ముగుస్తాయి. మేమిద్దరం చాలాకాలంగా రాజకీయాల్లో ఉన్నాం. ప్రస్తుతం దేశాధ్యక్షులుగా కొనసాగుతున్నాం. ఈ చర్చల ద్వారా కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని భావిస్తున్నా'' అని ట్రంప్ అన్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రస్తుతం మగడాన్‌లో స్థానిక ప్రభుత్వాధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మాస్కో నుంచి మగడాన్‌కి 8 గంటలు విమానంలో ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి అలాస్కాకు మరో నాలుగు గంటల సమయం పడుతుంది. టైమ్ జోన్ వల్ల పుతిన్ రెండుసార్లు శుక్రవారంలోనే ఉండనున్నారు. ప్రస్తుతం మగడాన్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలు అవుతుండగా.. అలాస్కాలో శుక్రవారం ఉదయం 7 గంటలు అవుతోంది.ట్రంప్‌పుతిన్ భేటీపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మరోసారి స్పందించారు. ''ఇది యుద్ధాన్ని ముగించాల్సిన సమయం. దీనికి అవసరమైన చర్యలను రష్యా చేపడుతుందని భావిస్తున్నాం. అమెరికా మంచి విషయం చెబుతుందని ఆశిస్తున్నాం'' అని జెలెన్‌స్కీ సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు.

# సూపర్‌సిక్స్ సూపర్ హిట్




ఇదే ఆల్‌టైం రికార్డు'గా అభివర్ణించారు. ఎన్టీఆర్ భరోసా కింద 64 లక్షల మందికి ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చామన్నారు. పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు రూ.10వేల కోట్లతో తల్లికి వందనం పథకాన్ని తీసుకొచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో మొదట విడతగా రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం ఇచ్చిన రూ.2వేలు కలిపి మొత్తం రూ.7వేల చొప్పున రూ.3,173 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని చెప్పారు. దీపం పథకం కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రూ.2,684 కోట్లు ఖర్చుతో 2కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్సులో ఆడబిడ్డలకు 'స్త్రీశక్తి' పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇస్తున్నామని చెప్పారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని.. ఈ నెలాఖరుకు నియామకాలు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేశామని గుర్తుచేశారు. 204 అన్న క్యాంటీన్లలో 5.16కోట్లమందికి రూ.5కే కడుపు నింపుతున్నామని చెప్పారు. 6 వేలకు పైగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.10వేల చొప్పున విడుదల చేస్తున్నామని తెలిపారు.

అర్చకుల వేతనాలను రూ.15 వేలకు పెంచామని, ఆలయాల్లో అన్యమతస్థులు లేకుండా చూస్తున్నామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25వేలకు పెంచామని.. దేవాలయ ట్రస్టు బోర్డుల్లో వారికి చోటు కల్పించామన్నారు. 40వేల సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. కల్లుగీత కార్మికులకు 10శాతం మద్యం షాపులు, బార్లు కేటాయించామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించామని తెలిపారు. చేనేతకు నెలకు 200యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చామన్నారు. 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు 5వేల చొప్పున గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నామని, మహిళల ఆత్మగౌరవం కాపాడుతున్నామని తెలిపారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

**గ్రోత్ ఇంజన్లుగా నగరాలు, పట్టణాలు..**

నగరాలు, పట్టణ ప్రాంతాలను రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్లుగా అభివృద్ధి చేస్తున్నాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. 100 గజాల్లోపు స్థలాల్లో బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటిని నిర్మించుకునే అవకాశం కల్పించాం. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగిస్తున్నాం. ఇప్పటివరకు 9ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించి రూ.5.94 లక్షల కోట్ల విలువైన 113 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలు నవ్యాంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటి వరకు 1.5 కోట్ల టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మద్యం పాలసీని రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 పౌరసేవలు అందిస్తున్నాం. అత్యంత పేదరికంలో ఉన్న వారిని ఆదుకునేందుకు తీసుకొచ్చిన కార్యక్రమం జీరో పావర్టీపీ4. ఉన్నతస్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనిచ్చి పైకి తీసుకురావడమే దీని ముఖ్యోద్దేశం.

**3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా..**

మోదీ నాయకత్వంలో త్వరలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నాం. మనది డెడ్ ఎకానమీ కాదు, గుడ్ ఎకానమీ. సైనిక శక్తిలోనూ మనమేంటో ఆపరేషన్ సిందూర్‌తో నిరూపించాం. శత్రుదేశాలు తూటాలు పేల్చితే.. మిస్సైళ్లతో బదులిచ్చిన మన త్రివిధ దళాలకు జైకొడదాం. మోదీ వికసిత్ భారత్ 2047 విజన్ రూపొందించారు. మనం స్వర్ణాంధ్ర2047 విజన్‌ను రూపొందించాం. 2047 నాటికి భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలుస్తుంది.

**గ్రామ స్వరాజ్యం దిశగా..**

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మాగాంధీ మాటలు మాకెప్పుడూ ఆచరణీయం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అత్యధికంగా రూ.5,211 కోట్లు ఖర్చు పెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో 4 వేల కి.మీ సీసీ రోడ్లు, 250 కి.మీ బీటీ రోడ్లు నిర్మించాం. 2028 నాటికి జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ మా విధానం. ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్, రియల్‌టైమ్ మానిటరింగ్ విధానాలతో ప్రజారోగ్యానికి సంజీవనిగా వైద్యశాఖను తీర్చిదిద్దాం. సీఎం సహాయ నిధి నుంచి రూ.552 కోట్లు అందించాం. సూపర్ సిక్స్, మేనిఫెస్టో అమలుతో ప్రజల జీవనప్రమాణాలు మారుస్తున్నాం.

# అప్పుల కుప్ప అమెరికా





**37 లక్షల కోట్ల డాలర్లకు రుణభారం**
**జీడీపీలో 122 శాతానికి సమానమిది**
**ప్రతీ 3 నెలలకు లక్ష కోట్ల భారం**

అమెరికా దేశ రుణభారం రికార్డు స్థాయిలో 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. కొవిడ్ మునుపటి అంచనాల కంటే ముందుగానే ఆ దేశ రుణాలు ఈ స్థాయికి చేరుకోవడం గమనార్హం. అమెరికా రుణాలు ఈ స్థాయికి 2030 తర్వాత చేరుకుంటాయని 2020 జనవరిలో కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది. కానీ కొవిడ్19 మహమ్మారితో అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచేందుకు ట్రంప్, బైడెన్ ప్రభుత్వాలు భారీగా రుణాలు తీసుకోవడంతో అంచనాల కంటే వేగంగా అప్పులు పెరిగాయి.

**రుణాల ప్రభావం ఏంటంటే..?**

ప్రపంచంలోనే అత్యధిక రుణభారం అమెరికా మీద ఉంది. ఇందులో పావు వంతు మిగతా దేశాలది. దీంతో ఆ దేశ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అమెరికా ప్రభుత్వం తన రుణదాతలకు చెల్లించాల్సిన మొత్తం సొమ్ము ప్రస్తుతం 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది అమెరికా జీడీపీలో 122 శాతానికి సమానం. ప్రతి మూడు నెలలకు రుణభారం దాదాపు లక్షల కోట్ల డాలర్లు పెరుగుతోంది. 2020లో కొవిడ్ సమయంలో అత్యధికంగా రుణాలు, జీడీపీ నిష్పత్తి 133 శాతానికి చేరింది. ప్రపంచంలోనే ఈ నిష్పత్తి అధికంగా ఉన్న మొదటి 10 దేశాల్లో అమెరికా కూడా ఉంది.



అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణం 30.3 లక్షల కోట్ల డాలర్లు కాగా.. ఆ దేశ రుణ భారం అంతకంటే ఎక్కువగా దాదాపు 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రభుత్వం పన్ను వసూళ్ల కంటే వ్యయాలు అధికంగా చేస్తే లోటు ఏర్పడుతుంది. ఈ లోటును పూడ్చడానికి రుణాలపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం రుణాల పరిమితిని అమెరికా కాంగ్రెస్ నిర్దేశిస్తోంది. పరిమితిని చేరుకున్న తర్వాత, కాంగ్రెస్ దాన్ని పెంచకపోతే ప్రభుత్వం రుణాలు తీసుకోవడం కుదరదు.

క్లింటన్ 'మిగులు'.. ట్రంప్ 'లోటు'

ట్రంప్ మొదటి హయాంలో, ముఖ్యంగా 2020 కొవిడ్ సమయంలో ప్రభుత్వ వ్యయాలు భారీగా పెరిగాయి. ఉద్యోగ కోతల కారణంగా పన్ను ఆదాయాలు గణనీయంగా తగ్గాయి. ఆ సంవత్సరంలో లోటు మొత్తం జీడీపీలో దాదాపు 15 శాతానికి చేరింది. అధ్యక్షుడిగా బిల్ క్లింటన్ ఉన్న సమయంలో దేశం మిగులు సాధించింది. ఆ సమయంలో డాట్ కామ్ విప్లవం వంటి అనుకూలమైన ఆర్థిక పరిస్థితులతో పన్నులు పెరిగి ఆదాయం అధికమైంది.

మొత్తం 37 లక్షల కోట్ల డాలర్ల రుణాల్లో.. 27 లక్షల కోట్ల డాలర్లు దేశీయంగా తీసుకున్నవే. మొత్తం రుణాల్లో అమెరికా ప్రైవేట్ పెట్టుబడిదార్లు, సంస్థల వాటా 42 శాతంగా; ప్రభుత్వ సంస్థలు, ట్రస్టుల వాటా 20 శాతంగా; ఫెడరల్ రిజర్వ్ వాటా 13 శాతంగా ఉంది. విదేశీ పెట్టుబడిదార్ల వాటా 25 శాతంగా ఉంది.

**అత్యధిక రుణాలు కొన్న దేశాలివే..**

సురక్షితమైన, స్థిరమైన పెట్టుబడిని అందిస్తాయనే నమ్మకంతో అమెరికా రుణాలను పలు దేశాలు కొనుగోలు చేస్తాయి. విదేశీ మారకపు నిల్వలను నిర్వహించడంతో పాటు వడ్డీ ఆదాయాన్ని ఇవి అందిస్తాయి. విదేశీ పెట్టుబడిదారుల చేతిలో 9.05 లక్షల కోట్ల డాలర్ల రుణాలు ఉన్నాయి. అత్యధికంగా జపాన్ చేతిలో 1.10 లక్షల కోట్ల డాలర్లు ఉన్నాయి. భారత్ కూడా 239.9 బి. డాలర్ల రుణాలను కొనుగోలు చేయడం విశేషం.




## మరోసారి ప్లాట్‌ఫామ్ ఫీజు పెంచిన స్విగ్గీ: ఈసారి ఎంతంటే?

పండుగ సీజన్‌లో ఆర్డర్ల సంఖ్య పెరగడంతో.. ప్రముఖ ఫుడ్ డెలివరీ మేజర్ 'స్విగ్గీ' ప్రతి ఫుడ్ డెలివరీ ఆర్డర్‌పై వసూలు చేసే ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.14కి పెంచింది. ప్రతి ఆర్డర్‌ను మరింత లాభదాయకంగా మార్చడంతో పాటు.. దాని లాభాలను పెంచుకోవడం కోసం కంపెనీ గతంలో వసూలు చేస్తున్న రూ.12 ఫీజును రూ. 14లకు పెంచింది. అంటే తాజాగా రెండు రూపాయలు పెంచిందన్న మాట.యూనిట్ ఎకనామిక్స్‌ను మెరుగుపరచుకోవడానికి స్విగ్గీ.. ఏప్రిల్ 2023లో ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేయడం ప్రారంభించింది. అప్పటి నుంచి.. అదనపు ఖర్చులు ఉన్నప్పటికీ ఆర్డర్ వాల్యూమ్‌లపై ఎటువంటి ప్రభావం చూపకపోవడంతో కంపెనీ ప్లాట్‌ఫామ్ ఫీజును క్రమంగా పెంచింది. ప్రతి ఆర్డర్‌పై రూ.2 పెరుగుదల వినియోగదారులపై పెద్దగా భారం చూపకపోయినా.. స్విగ్గీ వంటి కంపెనీల ఆర్థికస్థితి మెరుగుపడటంతో దోహదపడుతుంది.




## ఆస్ట్రేలియా కంపెనీని కొనేస్తున్న యాక్సెంచర్

ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ ఆస్ట్రేలియన్ సైబర్ సెక్యూరిటీ సంస్థ సైబర్ సీఎక్స్ ను కొనుగోలు చేస్తోంది. ఈ రంగంలో ఇది అత్యంత భారీ ఒప్పందంగా తెలుస్తోంది. ఆస్ట్రేలియన్ ఫైనాన్షియల్ రివ్యూ పత్రిక ప్రకారం.. ఈ డీల్ విలువ 1 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు 5,400 కోట్లు).

రాయిటర్స్ కథనం ప్రకారం.. ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బీజీహెచ్ క్యాపిటల్ సైబర్ సీఎక్స్ ను విక్రయిస్తోంది. అయితే ఈ ఒప్పందంలోని ఆర్థిక నిబంధనలు మాత్రం వెల్లడి కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, హెల్త్ కేర్ నుంచి ఫైనాన్స్ వరకు కంపెనీలు కార్యకలాపాలకు అంతరాయం కలిగించే, సున్నితమైన డేటాతో రాజీపడే అధునాతన బెదిరింపులతో సతమతమవుతున్న నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. బీజీహెచ్ క్యాపిటల్ మద్దతుతో 12 చిన్న సైబర్ సెక్యూరిటీ సంస్థల విలీనం ద్వారా మెల్బోర్న్‌కు చెందిన సైబర్ సీఎక్స్ 2019లో ఏర్పడింది. ఈ సంస్థ ప్రస్తుతం 1,400 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ అంతటా భద్రతా కార్యకలాపాల కేంద్రాలను నిర్వహిస్తుంది. లండన్, న్యూయార్క్ లలో కార్యాలయాలు ఉన్నాయి. యాక్సెంచర్ 2015 నుండి ఇలాంటి 20 భద్రతా కొనుగోళ్లను పూర్తి చేసింది. వీటిలో బ్రెజిల్ సైబర్ డిఫెన్స్ సంస్థ మార్ఫస్, ఎంఎన్ఈఎమ్ఓ మెక్సికో, స్పెయిన్‌కు చెందిన ఇన్నోటెక్ సెక్యూరిటీ వంటివి ఇటీవల కొనుగోలు చేసిన సంస్థలు.

# చాలామందికి తెలియని వాట్సాప్ టిప్స్

**టెక్నాలజీ పెరుగుతోంది, ప్రతి అంశంలో పురోగతి కనిపిస్తోంది. స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే అందరూ వాట్సాప్ వినియోగిస్తున్నారు. కానీ చాలామందికి చాట్‌జీపీటీతో చాట్ చేయడం, వాయిస్ మెసేజ్‌ను టెక్స్ట్ రూపంలోకి ఎలా మార్చాలి?, వీడియో కాల్స్‌కు ఫన్ యాడ్ చేయడం వంటివి తెలియదు. ఈ కథనంలో అలాంటి ఆసక్తికరమైన వాట్సాప్ టిప్స్ గురించి తెలుసుకుందాం.**

**చాట్‌జీపీటీతో చాటింగ్**

ఏఐ అందుబాటులోకి వచ్చిన తరువాత చాట్ జీపీటీతో చాటింగ్ చేయడం సాధ్యమవుతోంది. మీరు దీనికోసం చేయాల్సిందల్లా.. చాట్‌జీపీటీ యొక్క ప్రత్యేక నంబర్‌ను యాడ్ చేసుకోవడమే. ఇలా చేస్తే మీరు వాట్సాప్‌లోనే చాటింగ్ చేయవచ్చు. ప్రశ్నలు అడగడం వంటివి చేయవచ్చు. దీనిని ఒక తెలివైన ఫ్రెండ్ మాదిరిగా ఉపయోగించుకోవచ్చు.

**వాయిస్ మెసేజ్‌లను టెక్స్ట్ రూపం**

ఐఫోన్ వినియోగదారులకు మాత్రమే వాయిస్ మెసేజ్ ట్రాన్‌స్క్రిప్షన్ ఫీచర్ లభిస్తుంది. నలుగురిలో ఉన్నప్పుడు మీకు వచ్చిన వాయిస్ మెసేజ్ వినడానికి ఇబ్బంది పడే సమయంలో.. ఈ ఫీచర్ వచ్చిన సందేశాన్ని టెక్స్ట్ రూపంలోకి మారుస్తుంది. అప్పుడు వచ్చిన విషయాన్ని చదివి తెలుసుకోవచ్చు. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లకు కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తుంది.




**వీడియో కాల్‌లకు ఫన్ యాడ్**

వీడియో కాల్స్ మాట్లాడుతున్న సమయంలో.. మీ ముఖం విసుగ్గా అనిపించినప్పుడు.. మ్యాజిక్ వాండ్ ఐకాన్ ద్వారా విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ ట్వీక్‌లు లేదా ఫిల్టర్‌లను ఉపయోగించి కొంత ఆనందపడొచ్చు. ఇది సరదాగా కూడా ఉంటుంది.

**ఈ మెయిల్ లేదా పాస్‌కీతో లాగిన్**

ఎస్ఎమ్ఎస్ కోడ్ పనిచేయనప్పుడు.. మీరు ఈమెయిల్‌ను లింక్ చేసి వెరిఫికేషన్ కోడ్స్ స్వీకరించవచ్చు. అంతే కాకుండా.. భవిష్యత్ లాగిన్‌ల కోసం పాస్‌కీని సెట్ చేసుకోవచ్చు. ఇది స్టార్ట్ చేసిన తరువాత కోడ్‌లను టైప్ చేయడానికి బదులుగా బయోమెట్రిక్ సాయంతో సైన్ ఇన్ చేసుకోవచ్చు.

**ఒక వాట్సాప్.. మల్టిపుల్ ఫోన్లలో**

ఒక నెంబరుకు ఒక వాట్సాప్ ఉంటుంది. రెండు లేదా మూడు మొబైల్ ఫోన్లలో ఒకే వాట్సాప్ లాగిన్ అవ్వాలనుకున్నప్పుడు లేదా ఉపయోగించాలనుకున్నప్పుడు.. మీ మొదటి ఫోన్ నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. రెండవ మొబైల్ ఫోనులో కూడా కనెక్ట్ చేసుకోవచ్చు. ఇది వర్క్ లైఫ్‌లో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ''వన్ అకౌంట్ మల్టిపుల్ స్మార్ట్‌ఫోన్స్'' అన్నమాట.

**ప్రైవేట్ సంభాషణలను లాక్**

మీరు చేసే చాటింగ్ రహస్యంగా ఉంచాలంటే.. లాక్ చేసుకోవచ్చు. దీనికి మీరు ఫేస్ ఐడీ, టచ్ ఐడీ లేదా బయోమెట్రిక్ వంటివి ఉపయోగించుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా.. మీ అనుమతి లేకుండా ఎవరూ మీ చాటింగ్ చూడలేరు.

**పర్సనల్ నోట్‌బుక్‌గా వాట్సాప్**

మీకు అవసరమైన విషయాన్ని సేవ్ చేసుకోవడానికి లేదా మర్చిపోకుండా ఉండటానికి పర్సనల్ నోట్‌బుక్‌గా వాట్సాప్ పనిచేస్తుంది. అంటే 'మై సెల్ఫ్' అన్నట్టు.. మీకు మీరే విషయాలను మెసేజ్ చేసుకోవచ్చు. వాటిని మళ్ళీ అవసరమైనప్పుడు చదువుకోవచ్చు.

ఇలాంటి టిప్స్ ఉపయోగించడం వల్ల వినియోగదారులకు సరదాగా ఉంటుంది. అంతే కాకుండా మీకు మీరే వాట్సప్‌ను ఉపయోగకరంగా కూడా మార్చుకోవచ్చు. మొత్తం మీద వాట్సప్‌ను సరదాగా ఉండే కమ్యూనికేషన్ హబ్‌గా మార్చుకోవడం మీ చేతుల్లోనే ఉందనే విషయం మాత్రమే మర్చిపోవచ్చు.

# రోజుకు 20 లక్షల పీపాల రష్యా చమురు భారత్‌కు..

**ట్రంప్ తాటాకు చప్పుళ్లకు భారత్ ఏమాత్రం బెదరలేదు. ఆగస్టులో కూడా రోజుకు 20 బ్యారెళ్ల చొప్పున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. దేశంలోని రిఫైనరీలు ఆర్థిక వెసులుబాటుకే మొగ్గు చూపుతున్నాయి. మన దేశం రోజుకు 52 లక్షల పీపాల చమురు కొనుగోలు చేస్తుంది. దీనిలో 38 శాతం రష్యా నుంచే వస్తోంది. ఈ విషయాన్ని డేటా విశ్లేషణ సంస్థ కెప్లర్ వెల్లడించింది.**

వాస్తవానికి జులైలో రష్యా నుంచి వచ్చే చమురు రోజుకు 16 లక్షల పీపాలే ఉంది. ఆగస్టులో ఇరాక్, సౌదీ నుంచి దిగుమతి అయ్యే చమురు తగ్గించుకోవడంతో.. ఆ మేరకు రష్యా నుంచి దిగుమతులు పెరిగాయి. ఇక అమెరికా నుంచి రోజుకు 2,64,000 బ్యారెళ్లు మాత్రమే దిగుమతి చేసుకొంటున్నాం. ''ట్రంప్ కార్యవర్గం జులై చివర్లో భారీ టారిఫ్‌లు, పెనాల్టీలు విధించినా.. రష్యా నుంచి చమురు దిగుమతులు బలంగానే ఉన్నాయి. కానీ, వీటిల్లో ప్రస్తుతం స్థిరత్వం కనిపిస్తోంది. ఈ ఆర్డర్లు జూన్, జులై మొదటి వారంలో పెట్టినవి'' అని కెప్లర్ పరిశోధకుడు సుమిత్ వెల్లడించారు. టారిఫ్‌ల కారణంగా చెల్లింపుల్లో సమస్యలు, షిప్‌మెంట్‌లో ఇబ్బందులు, పాలసీ మార్పులు వంటి వాటి ప్రభావం సెప్టెంబర్, అక్టోబర్‌లో కనిపిస్తాయన్నారు. ప్రస్తుతానికి చమురు దిగుమతులు తగ్గించుకోవాలని ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవన్నారు.




ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ అర్వీందర్ సింగ్ ఇటీవల మాట్లాడుతూ.. ట్రంప్ నిర్ణయం తర్వాత మాస్కో నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించాలని ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి సూచనలు రాలేదన్నారు. ఈ క్రమంలో తాము కొనుగోళ్ల పెంపు లేదా తగ్గింపునకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఏప్రిల్-జూన్‌లో ఐవోసీ ప్రాసెస్ చేసే చమురులో రష్యా నుంచి వచ్చేదాని వాటా 22శాతం ఉంది. బీపీసీఎల్ మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకొన్నట్లు ఆ సంస్థ ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ రామకృష్ణ గుప్తా వెల్లడించారు. డిస్కౌంట్ తగ్గిన కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ మొత్తం చమురు 3035శాతం వరకు మాస్కో నుంచి వచ్చేలా చూసుకొంటామన్నారు.

ప్రపంచంలో చమురు అత్యధికంగా వాడే దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. పశ్చిమ దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించగానే.. న్యూఢిల్లీ వెంటనే రంగంలోకి దిగింది. రష్యా నుంచి అత్యధికంగా కొనుగోలు చేయడం మొదలుపెట్టింది. యుద్ధానికి ముందు ఆ దేశ చమురు వాటా భారత్‌లో 0.2శాతమే.. కానీ, ఆ తర్వాత అది 3540శాతానికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్ చమురుతో పోలిస్తే.. 40 డాలర్లు చౌకగా లభించేది. ఇప్పుడు ఆ డిస్కౌంట్ 1.5 డాలర్లకు మాత్రమే పరిమితమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ అమెరికా, పశ్చిమాఫ్రికా, లాటిన్ అమెరికా మార్కెట్లను కూడా ఓ ఆప్షన్‌గా పరిశీలిస్తోంది.




## దీపావళికి జీఎస్టీ బొనాంజా.. ఇక రెండు శ్లాబు రేట్లే!

**నిత్యం వాడే ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు తగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. దీపావళి నాటికి రేట్లు తగ్గించి పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ ప్రకటన వెలువడిన వెంటనే ఆర్థిక మంత్రిత్వ శాఖ జీఎస్టీ గురించి కీలక ప్రకటన చేసింది. జీఎస్టీలో ఇకపై రెండు శ్లాబులే ఉండబోతున్నాయని వెల్లడించింది. కొన్ని ఉత్పత్తులకు మాత్రమే ప్రత్యేక రేట్లు వర్తిస్తాయని తెలిపింది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం జీఎస్టీ శ్లాబులు ఉన్నాయి.**

గడిచిన ఎనిమిదేళ్లలో జీఎస్టీ విషయంలో తమ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని ప్రధాని మోదీ ఎర్రకోట వేదికగా చేసిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రాలతో చర్చించి తదుపరి దశ సంస్కరణలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనివల్ల పన్ను భారం తగ్గనుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాన్య పౌరులకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా ప్రయోజనం పొందుతాయని పేర్కొన్నారు. నిత్యం వినియోగించే వస్తువుల ధరలు తగ్గడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుందన్నారు. ఏ విధంగా ఊరట కల్పించేదీ మోదీ వెల్లడించనప్పటికీ కాసేపటికే ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.


**జీఎస్టీలో తదుపరి దశ సంస్కరణలు**

'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో మరిన్ని సంస్కరణలను ప్రతిపాదిస్తోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. నిర్మాణాత్మక సంస్కరణలు, పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, జీవన వ్యయాలు తగ్గింపు వంటి మూడు స్తంభాలపై ఈ బ్లూప్రింట్ రూపొందించినట్లు తెలిపింది. సాధారణ ప్రజలు వాడే వస్తువుల ధరలు తగ్గించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్రాలకు చెందిన మంత్రులతో కూడిన మంత్రుల బృందాన్ని జీఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేసిందని తెలిపింది. ఇందులో స్టాండర్డ్, మెరిట్ వంటి రెండు రేట్లు మాత్రమే ఉంటాయని పేర్కొంది. మూడు పిల్లర్లకు సంబంధించి ప్రతిపాదనలను మంత్రుల బృందం చర్చలకు పంపామని, రాబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించి ఏకాభిప్రాయం సాధిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది.

# వారెవ్వా..! తలైవా

## రజనీకాంత్ సినీ ప్రయాణానికి 50 వసంతాలు

**స్టైల్... పంచ్...**
**- ఇవి రజనీ కోసమే పుట్టాయేమో!**
**క్రేజ్... ఇమేజ్...**
**- ఈ మాటలకు అచ్చమైన నిర్వచనంగా రజనీ కటౌట్‌ని చూపిస్తే చాలేమో!**
**హీరోయిజం... మేనరిజం...**
**వీటి పేటెంట్ రజనీ సొంతమా అనే సందేహం కలగకమానదు.**
**'నాన్నా...' అంటూ ఆయన ఓ చిన్న డైలాగ్ చెబితే చాలు థియేటర్‌కి పూనకాలు వచ్చేస్తాయి. రెండు వైపులా అలా చొక్కా విసిరినా... కళ్ల జోడు సవరించుకున్నా అదొక స్టైలే.**



ఓ చిన్న సైగతో సన్నివేశాన్ని తనవైపు తిప్పుకుంటాడు. పేజీలకొద్దీ మాటలకి కూడా సాధ్యం కాని భావోద్వేగాల్ని తన శైలి ఓ చిన్న నవ్వుతోనే పండిస్తాడు. అదే రజనీ ప్రత్యేకం. ఆ పేరే ఓ మంత్రం. ఆయన తెరపై కనిపిస్తే చాలు... అదొక ఇంద్రజాలం! ప్రేక్షకుడు కళ్లు తిప్పుకోలేని సమ్మోహనం! అందుకే తరాలు మారుతున్నా తరగని అభిమానం ఆయన సొంతమవుతూ ఉంది. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకెళుతున్న అసలు సిసలు సూపర్‌స్టార్ రజనీకాంత్. ఆయన వెండితెర వెలుగులకు నేటితో యాభయ్యేళ్లు. రజనీ తొలి చిత్రం 'అపూర్వ రాగంగళ్' 1975 ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకొచ్చింది. వయసు పెరుగుతోంది. కొత్తతరం దూసుకొస్తోంది. కానీ రజనీకాంత్ క్రేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటికీ ఆయన దారి రహదారే. రజనీ సినిమా వస్తోందంటే చాలు మిగతా సినిమాలు పక్కకు తప్పుకుంటూ ఉంటాయి. ఆయనతో సినిమాలు చేసేందుకు యువ దర్శకులు ఇప్పటికీ పోటీ పడుతుంటారు.

రజనీ సినిమా విడుదల అంటే ఆ హంగామా తెలుగు, తమిళంకే పరిమితం కాదు, జపాన్‌లోనూ ఆయన కటౌట్‌కి పుష్పాభిషేకాలు జరుగుతుంటాయి. అదీ రజనీ క్రేజ్ అంటే. ఆసియా ఖండంలోనే అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయకుల్లో రజనీ ఒకరు. రజనీ తమిళంలోనే కాకుండా... తెలుగు, కన్నడ, హిందీ భాషల్లోనూ సినిమాలు చేశారు. తన తొలి హిందీ చిత్రం అమితాబ్ బచ్చన్‌తో కలిసి చేశారు. విలనిజం అంటే ఆయనకి ఎంతో ఇష్టం. తొలినాళ్లల్లో విలన్‌గానూ తెరపై ప్రభావం చూపించారు. 'దళపతి', 'బాషా', 'ముత్తు', 'అరుణాచలం', 'నరసింహా', 'చంద్రముఖి', 'శివాజీ', 'రోబో', 'జైలర్'... ఇలా ఎన్నెన్నో విజయాలు. ఆయన సినిమాలు తమిళంలో తెరకెక్కినా సరే... తెలుగులోనూ అనువాదాలుగా ప్రేక్షకుల ముందుకొచ్చి సంచలన విజయాల్ని సొంతం చేసుకున్నాయి.

గురువారం తన 171వ చిత్రం 'కూలీ'తో ప్రేక్షకుల ముందుకొచ్చారు రజనీకాంత్. ఆయనకు ప్రేక్షకుల్లో ఉన్న తిరుగులేని క్రేజ్‌కి మరోసారి అద్దం పట్టింది చిత్రం. కథానాయకుడిగా యాభయ్యేళ్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా భాషతో సంబంధం లేకుండా సినీ ప్రముఖులు ఆయనకి అభినందనలు తెలిపారు. 'యాభయ్యేళ్లు... ఒక సింహాసనం, ఒక వ్యక్తి...' అంటూ సంగీత దర్శకుడు అనిరుధ్.. రజనీ గురించి ట్వీట్ చేశారు. ఆ మాట అక్షరాలా నిజం. రజనీ క్రేజ్‌కి ఆకాశమే హద్దు... కానీ ఆయన వ్యక్తిగా ఒకటో అంతస్తుపై ఉన్నట్టు కూడా అనిపించరు. ఆయన కాళ్లు ఎప్పుడూ నేలపైనే ఉంటాయి. ఓ తెల్లటి చొక్కా ధరించి చెరగని చిరునవ్వుతో ఎయిర్‌పోర్ట్‌లోనో లేదంటే వీధుల్లోనో నిరాడంబరంగా కెమెరాల కంట పడుతుంటారు. అప్పుడప్పుడూ సన్నిహితులతో కలిసి సరదాగా స్కూటర్‌పై చక్కర్లు కొడుతూ కనిపిస్తారు, బడ్డీ కొట్టు దగ్గర నిలుచుని రుచులు ఆస్వాదిస్తారు. కుదిరినప్పుడు హిమాలయాలకీ వెళ్లొస్తుంటారు. అసాధారణ స్థాయికి ఎదిగినా.. అత్యంత సాధారణంగా మెలిగే ఆయన వ్యక్తిత్వమే ఆయన్ని మరింత మందికి చేరువ చేస్తోంది.

**అదే రజనీ మ్యాజిక్**

ఆయన ఆరడుగుల ఆజానుబాహుడేమీ కాదు... తెరపై ఆరు పలకల దేహంతోనూ కనిపించరు. కానీ ఆయన తెరపై కనిపిస్తే చూసేందుకు ప్రేక్షకులు ఎగబడుతుంటారు. కారణం... ఆయన నటనలోని మ్యాజిక్. ఆయన స్టైల్‌లో ఉన్న ప్రత్యేకత. రజనీ అసలు పేరు శివాజీరావు గైక్వాడ్. 1950 డిసెంబరు 12వ తేదీన కర్ణాటకలో జన్మించారు. పాఠశాల రోజుల్లోనే నాటకాలపై మక్కువ పెంచుకున్నారు. చదువు పూర్తయ్యాక, బస్సు కండక్టర్‌గా ఆయన జీవితాన్ని మొదలు పెట్టారు. ఇప్పుడు థియేటర్‌లో ఆయన స్టైల్‌ని చూసి ముచ్చట పడుతున్నాం కానీ... అప్పట్లో బస్‌లో ఆయన స్టైల్‌గా టికెట్లు కొడుతుంటే ప్రయాణికులు కళ్లప్పగించి చూసేవారట. ఆయన మాట తీరు... నడక కూడా ప్రత్యేకంగా ఉండేవట. అది చూసే రజనీ స్నేహితుడు సినిమా రంగంలోకి వెళ్లేలా ప్రోత్సహించారు. అదే ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది.

చెన్నైలో అడుగుపెట్టిన రజనీకి సినిమా కష్టాలు చాలానే ఎదురయ్యాయి. అన్నిటినీ తట్టుకుని ప్రయత్నాలు చేశారు. కె.బాలచందర్ దృష్టిలో పడి తొలి అవకాశాన్ని అందుకున్నారు. తమిళ పరిశ్రమలోని హీరోల శైలి, వాళ్ల ప్రత్యేకతకి భిన్నంగా ప్రయాణం చేయాలనుకున్నారు. అందుకు తగ్గట్టే ఆయన ప్రయాణం సాగింది. అదే ఆయన్ని తిరుగులేని స్టార్‌ని చేసింది. తొలి సినిమాలోనే తన స్నేహితుడు కమల్‌హాసన్‌తో కలిసి నటించారు. ఆ తర్వాత రజనీ, కమల్ ఇద్దరూ తమిళ చిత్రసీమకి రెండు కళ్లలా మారిపోయారు. ఒకరు నటనకి కేరాఫ్ అయితే... మరొకరు స్టైల్‌కి పర్యాయపదంలా నిలిచారు.

# పుట్టిన 10 రోజులకే అన్న చనిపోయాడు.. అమ్మ ఆస్పత్రికే వెళ్లలేదు: కంగనా రనౌత్



బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్‌కి ఫైర్ బ్రాండ్ అనే గుర్తింపు ఉంది. ఏ విషయాన్ని అయినా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడుతుంది. తన వ్యక్తిగత విషయాలతో పాటు దేశంలో జరుగుతున్న పలు ఘటనలపై కూడా ఆమె స్పందిస్తుంటారు. వివాదస్పద వ్యాఖ్యలు చేయడం.. ట్రోలింగ్‌ని ఎదుర్కొవడం ఆమెకు కొత్తేమి కాదు. అయితే ప్రతి ఇంటర్వ్యూలోనూ రాజకీయాలు, సినిమా అంశాలపై మాట్లాడే కంగనా..ఈ సారి మాత్రం తన ఫ్యామిలీ విషయాలను షేర్ చేసుకుంది.

తన సోదరుడు పుట్టిన 10 రోజులకే చనిపోయాడని ఎమోషనల్ అయింది. తాజాగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా మాట్లాడుతూ.. 'నా కంటే ముందే మా అమ్మకి బాబు పుట్టి చనిపోయాడు. మా అన్నయ్య పుట్టిన 10 రోజులకే ఆస్పత్రిలో చనిపోయాడట. సరైన కారణం తెలియదు కానీ 'బొడ్డు తాడు కొంచెం ఎక్కువగా కత్తిరించడం వల్లే చనిపోయాడు' అని మా అమ్మ నమ్మింది. ఈ విషయంలో చాలా బాధపడింది.

ఇదంతా కళ్లారా చూసిన మా నాన్నమ్మ.. తర్వాత మా అమ్మని ఆస్పత్రికే పంపలేదు. అంతేకాదు ప్రసవానికి ఎవరూ ఆస్పత్రికి వెళ్లొద్దని కండీషన్ పెట్టింది. దీంతో మా అమ్మ ఇంట్లోనే ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మా అత్తమ్మ కూడా ఇంట్లోనే ఇద్దరు పిల్లలను కనింది. ఆస్పత్రికి వెళ్తే పిల్లలు చనిపోతారన్న మూఢనమ్మకంతో మా నాన్నమ్మ వాళ్లకు ఇంట్లోనే ప్రసవం అయ్యేలా ఏర్పాట్లు చేసింది' అని కంగనా చెప్పుకొచ్చింది.

**నాన్న తక్కువ చేసి మాట్లాడేవాడు**

నాన్న ఎప్పుడూ తనను తక్కువ చేసి మాట్లాడేవాడని కంగనా గుర్తు చేసుకుంది. 'బాగా చదువుకుంటేనే మనలాంటి మంచి ఫ్యామిలీ దొరుకుతుందని చెప్పేవాడు. ఒకవేళ చదువుకోకపోతే..మంచి వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయనని బెదిరించేవాడు. వాళ్లు చెప్పేది నా మంచి కోసమే అని తెలుసు. వాళ్లు కోరుకునే జీవితం బాగుంది. కానీ నాకు మాత్రం అలా జీవించాలని లేదు' అని కంగనా చెప్పుకొచ్చింది.

హిమాచల్ ప్రదేశ్‌కి చెందిన రాజ్‌పుత్ కుటుంబంలో కంగనా జన్మించింది. ఆమె తల్లి ఆశా రనౌత్ టీచర్. తండ్రి అమర్‌దీప్ రనౌత్ వ్యాపారవేత్త. కంగనాకు అక్క, తమ్ముడు ఉన్నారు. 2024లో జరిగిన లోకసభ ఎన్నికల్లో మండి నియోజకవర్గం (హిమాచల్ ప్రదేశ్) నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.

# 'అమ్మ' ప్రెసిడెంట్‌గా శ్వేతా మేనన్.. తొలి నటిగా రికార్డు



అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఎన్నికయ్యారు. ప్రత్యర్థి దేవన్‌పై గెలిచిన ఆమె.. 'అమ్మ' ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తొలి నటిగా రికార్డు నెలకొల్పారు. లక్ష్మీ ప్రియ ఉపాధ్యక్షురాలిగా, కుక్కు పరమేశ్వరన్ జాయింట్ సెక్రటరీగా, అన్సిబా హాసన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొచ్చిలో ఓటింగ్ జరిగింది. ఫలితాలను సాయంత్రం వెల్లడించారు. 506 మంది సభ్యులకు ఓటు హక్కు ఉండగా 298 మంది ఓటేశారు. ప్రముఖ నటులు కొందరు ఓటు వేయలేదని సమాచారం.

31 ఏళ్ల క్రితం 'అమ్మ' ప్రారంభమైంది. ఎం.జి.సోమన్, మధు, మోహన్‌లాల్ తదితరులు ప్రెసిడెంట్‌గా పని చేశారు. పలువురు నటులు, దర్శకులపై నటీమణులు చేస్తున్న లైంగిక ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యతగా 'అమ్మ' అధ్యక్ష పదవికి అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ గతేడాది రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో, 2027లో నిర్వహించాల్సిన ఎన్నికలను ఈ ఏడాది నిర్వహించారు. కొన్ని రోజుల క్రితం శ్వేతా మేనన్‌పై ఓ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఆమె గెలుస్తారా? లేదా? అన్న ఉత్కంఠ మలయాళ చిత్ర పరిశ్రమలో నెలకొంది. 1994లో 'ఫెమినా మిస్ ఇండియా ఏషియా పసిఫిక్'గా నిలిచిన శ్వేతా మేనన్ 'అనస్వరం'తో నటిగా మారారు. ఆ తర్వాత '100 డిగ్రీ సెల్సియస్'లాంటి మలయాళ మూవీస్‌తోపాటు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ నటించారు. తెలుగులో 'ఆనందం'లో ప్రత్యేక గీతంలో మెరిసిన శ్వేత.. 'జూనియర్స్', 'రాజన్న' తదితర సినిమాల్లో సందడి చేశారు.

# వెబ్ సిరీస్ రివ్యూ: కానిస్టేబుల్ కనకం.. అడవిగుట్టలో ఏం జరిగింది?

**కానిస్టేబుల్ కనకం; నటీనటులు:** వర్ష బొల్లమ్మ, మేఘ లేఖ, రాజీవ్ కనకాల, అవసరాల శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, రమణ భార్గవ్ తదితరులు; సంగీతం: సురేశ్ బొబ్బిలి; దర్శకత్వం: ప్రశాంత్ కుమార్ దిమ్మల; నిర్మాత: సాయిబాబా కొవెలమూడి, వేమూరి హేమంత్ కుమార్; స్ట్రీమింగ్ వేదిక: ఈటీవీ విన్




నేటి కథానాయికలు అటు సినిమాతో పాటు, ఇటూ ఓటీటీలోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలా వర్ష బొల్లమ్మ కీలక పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' . తెలుగు ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్ ఎలా ఉంది? ఎలాంటి థ్రిల్ పంచింది.

**కథేంటంటే..**

శ్రీకాకుళం జిల్లాలోని రేపల్లె గ్రామ సమీపంలోని అడవిగుట్ట వైపు ఎవరు వెళ్లినా కనిపించకుండా పోతారు. ముఖ్యంగా మహిళలు అటువైపు వెళ్లడానికి వీల్లేదని ఊరి ప్రెసిడెంట్ (అవసరాల శ్రీనివాస్) ఆదేశాలు జారీ చేస్తాడు. పొరపాటున అటువైపు వెళ్లిన ముగ్గురు మహిళల ఆచూకీ లభ్యంకాదు. అదే గ్రామానికి మహిళా కానిస్టేబుల్‌గా వస్తుంది కనక మహాలక్ష్మీ అలియాస్ కనకం (వర్ష బొల్లమ్మ). ఆ ఊరికి వస్తున్న సమయంలో పరిచయమైన చంద్రిక (మేఘ లేఖ) స్నేహితురాలై, ఆమెతో విడదీయరాని అనుబంధం ఏర్పడుతుంది. ఒకరోజు కనకం, చంద్రిక కలిసి బండిపై వెళ్తుండగా ప్రమాదం జరుగుతుంది. ఆ తర్వాత నుంచి చంద్రిక కన్పించకుండా పోతుంది. ఇంతకీ చంద్రిక ఏమైంది? అడవిగుట్టలో దాగిన మర్మం ఏంటి? అక్కడకు వెళ్లిన మహిళలు ఏమవుతున్నారు? కానిస్టేబుల్ కనకం ఈ మిస్టరీని ఎలా ఛేదించింది? అన్నది సిరీస్.

**ఎలా ఉందంటే..**

సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వేదిక ఏదైనా ప్రేక్షకులను విశేషంగా అలరించే నేపథ్యం క్రైమ్ థ్రిల్లర్. యువ దర్శకులు కూడా ఈ జానర్‌కు అదనపు హంగులు జోడించి తెరపై ఆవిష్కరిస్తున్నారు. అలా 'కానిస్టేబుల్ కనకం' సిరీస్‌ను ఆసక్తికరంగా తీర్చిదిద్దడంలో దర్శకుడు ప్రశాంత్ కుమార్‌కు మంచి మార్కులే పడతాయి. చివరి వరకూ ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించడంలోనే ఈ కథల విజయం ఆధారపడి ఉంటుంది. ఆ విధంగా స్క్రీన్‌ప్లేను ఎంగేజింగ్‌గా నడిపించి వినోదం అందించడంలో దర్శకుడి ప్రయత్నం బాగుంది. రేపల్లె గ్రామం.. అడవిగుట్ట.. కానిస్టేబుల్ కనకం ఇలా మెయిన్ థీమ్, కీలక పాత్రలను మొదటి రెండు ఎపిసోడ్స్‌లో పరిచయం చేసిన దర్శకుడు మూడో ఎపిసోడ్ నుంచి అసలు పాయింట్‌కు వచ్చేశాడు. ఎప్పుడైతే చంద్రిక కనిపించకుండా పోయిందో, అప్పటి నుంచే అసలు కథ మొదలవుతుంది.

స్టేషన్ ఎస్సై వద్దని చెప్పినా, ఇన్వెస్టిగేషన్ చేయడం మొదలు పెట్టిన కనకానికి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. ఒక్కో క్లూ వెతుకుతూ ఆమె సాగించే ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది. అయితే, బల్లిని చూస్తేనే భయపడే కనకం.. ఒక్కసారిగా ధీరోదాత్తురాలిగా మారిపోవడమే కాస్త సినిమాటిక్‌గా అనిపిస్తుంది. స్టేషన్‌లో ఎస్సై, మరో కానిస్టేబుల్ చేతిలో ఎప్పుడూ అవహేళనకు గురయ్యే ఆమె ఒక్కసారిగా ఇంటెలిజెంట్‌గా మారిపోవడం నమ్మశక్యంగా అనిపించదు. ఒకవేళ ఆ పాత్రకు భయం ఆపాదించినా, తెలివైన అమ్మాయిగా ఎస్టాబ్లిష్ చేస్తూ ఒకట్రెండు సన్నివేశాలను రాసుకుని ఉంటే కనకం పాత్రపై ఇంకాస్త ఇంపాక్ట్ ఉండేది. చివరి రెండు ఎపిసోడ్స్‌లో ట్విస్ట్‌లను రివీల్ చేసే సన్నివేశాలు అలరిస్తాయి. అమ్మాయిల మిస్సింగ్ వెనుక ఉన్న పాయింట్ ఇటీవల విజయవంతమైన మూవీకి దగ్గరగా ఉన్నా, వాటిని ఉత్కంఠగా తీర్చిదిద్ది అలరించారు. కానిస్టేబుల్ కనకం ఇన్వెస్టిగేషన్ ఇంకా ఉందని చివరిలో చూపించి సీజన్ 2కు బాటలు వేశారు.

**ఎవరెలా చేశారంటే..**

అడవిగుట్ట మర్మం ఛేదించే కానిస్టేబుల్ కనకం పాత్రలో వర్షబొల్లమ్మ సహజంగా నటించింది. చివరి రెండు ఎపిసోడ్స్‌లో ఆమె నటన హైలైట్. కానిస్టేబుల్ కనకానికి అండగా నిలిచే పాత్రలో రాజీవ్ కనకాల ఒదిగిపోయారు. మహిళల గురించి ఆయన పలికే సంభాషణలు అలరిస్తాయి. మేఘ లేఖ, అవసరాల శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, రమణ భార్గవ్ తమ పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సిరీస్ బాగుంది. సురేశ్ బొబ్బిలి నేపథ్య సంగీతం సన్నివేశాల్లో గాఢతను పెంచింది. సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అన్నీ చక్కగా కుదిరాయి. దర్శకుడు ఎంచుకున్న పాయింట్‌లో కొత్తదనం లేకపోయినా చివరి వరకూ ఆ ఉత్కంఠను కొనసాగించడంలో మంచి మార్కులు సాధించారు.

**కుటుంబంతో చూడొచ్చా:** ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడొచ్చు. అసభ్య సన్నివేశాలు, సంభాషణలు లేవు. ఆరు ఎపిసోడ్స్ ఉన్నాయి. ఒక్కోటీ సుమారు 30 నిమిషాలు

**చివరిగా: థ్రిల్ పంచే కానిస్టేబుల్ కనకం..**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**

# 'డియర్ స్టూడెంట్స్' అంటూ క్లాస్ తీసుకుంటున్న నయనతార

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న కొత్త సినిమా 'డియర్ స్టూడెంట్స్' నుంచి టీజర్ విడుదలైంది. మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ నటిస్తున్న ఈ చిత్రాన్ని జార్జ్ ఫిలిప్ రాయ్, సందీప్ కుమార్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో నివిన్, నయన్ కాంబినేషన్‌లో వచ్చిన 'లవ్ యాక్షన్ డ్రామా' మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా విడుదలైన టీజర్ కూడా ఆసక్తిగానే ఉంది. నయనతార, శింబు లీడ్ రోల్స్‌లో నటించిన 'వల్లభ' (2006) సినిమా గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాలో స్టూడెంట్ వల్లభ (శింబు),ప్రొఫెసర్ స్వప్న (నయనతార) ప్రేమించుకుంటారు. ఇప్పుడు 'వల్లభ' సినిమా ప్రస్తావన ఎందుకంటే తనకంటే చిన్న వయస్కుడితో ప్రేమలో పడే కథలా డియర్ స్టూడెంట్ ఉంది.




# క్లైమాక్స్ షూటింగ్.. డైరెక్టర్ కట్ చెప్పకపోయేసరికి నా ప్రాణాలు పోయాయనుకున్నా..

**టాలీవుడ్ నటుడు జగపతిబాబు ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' మూవీలో యాక్ట్ చేస్తున్నాడు. అలాగే బుల్లితెరపై హోస్ట్‌గానూ కనిపించనున్నాడు. జయమ్ము నిశ్చయమ్మురా అనే టాక్ షోకి యాంకరింగ్ చేస్తున్నాడు. ఈ షో ఆగస్టు 17 నుంచి టీవీలో ప్రసారం కానుంది. ఇకపోతే జగ్గూ భాయ్ సోషల్ మీడియాలో అప్పడప్పడూ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఉంటాడు.**



**నా అసలు పేరు**

తాజాగా సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లు, ప్రశ్నలపై స్పందిస్తూ యూట్యూబ్‌లో ఓ వీడియో రిలీజ్ చేశాడు. అందులో జగపతిబాబు మాట్లాడుతూ.. నా పేరు జగపతి రావు. ఇండస్ట్రీలో రావులెక్కువైపోయారని నా పేరును జగపతిబాబుగా మార్చేశారు. అలాగే అందరికీ నోరు తిరగడానికి ఈజీగా ఉంటుందని జగ్గూభాయ్‌గా మారిపోయాను.

**చచ్చిపోయాననుకున్నా..**

అంతఃపురం సినిమా చివరి సీన్‌లో నేను దాదాపు చచ్చిపోయాననుకున్నాను. డైరెక్టర్ కృష్ణవంశీ సీన్‌లో లీనమైపోయి కట్ చెప్పలేకపోయాడు. నిజంగానే పోయాననుకున్నాను. నా కెరీర్ మొత్తంలో అంతఃపురం క్లైమాక్సే ఫేవరెట్ షాట్. నా జుట్టుకు రంగెందుకు వేసుకోనని అడుగుతుంటారు. నాకు ఇంకా జుట్టుండమే అదృష్టం. అది సహజంగానే తెల్లబడింది. కాబట్టి దాన్నలాగే వదిలేస్తాను. సహజంగా ఉంటేనే నేను బాగుంటాను. నన్నిలాగే వదిలేయండి. నాకు పెద్దగా కోరికలేం లేవు. చివరి శ్వాస వరకు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. అందుకే నిత్యం ప్రాణాయామం చేస్తుంటాను అని జగపతిబాబు చెప్పుకొచ్చాడు.

# బెల్లంకొండ, అనుపమ హర్రర్ సినిమా టీజర్ ఎలా ఉంది..?

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కొత్త సినిమా 'కిష్కింధపురి' టీజర్‌ను విడుదల చేశారు. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మిస్టరీ అండ్ హారర్ థ్రిల్లర్ మూవీగా 'కిష్కింధపురి' రానుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు రిలీజైన టీజర్ కూడా అంతే స్థాయిలో అలరించేలా ఉంది.

అర్చన సమర్పణలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 12న విడుదల కానుంది. అలాగే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా 'హైందవ' అనే మూవీ రూపొందుతోంది. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



నాలుగువందల ఏళ్ల క్రితం నాటి గుడి నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందట. ఈ రెండు సినిమాలు కూడా ఫారెస్ట్ ఎపిసోడ్స్ నేపథ్యంలోనే కొనసాగనున్నాయని తెలుస్తోంది.



## మన జెండా అక్కడి గడ్డపై సగర్వంగా..: రోహిత్ పోస్టు వైరల్

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత, మాజీ క్రికెటర్లూ విషెస్ తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ క్రికెటర్లు సచిన్, సెహ్వాగ్, ఐసీసీ ఛైర్మన్ జైషా వారిలో ఉన్నారు. గతేడాది భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. అప్పుడు ఫైనల్ జరిగిన బార్బడోస్ మైదానంలో భారత జెండాను అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ రెపరెపలాడించాడు. ఆ ఇమేజ్‌ను పోస్టు చేసిన అతడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు.

**"స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. జైహింద్" - సచిన్**

**"నా దేశం, నా గుర్తింపు, నా జీవితం.. జై హింద్" - గంభీర్**

**"హ్యాపీ ఇండిపెండెన్స్‌డే. విజయం కోసం అహర్నిశలు కష్టపడుతూనే ఉండాలి" - సూర్యకుమార్ యాదవ్**

**"త్రివర్ణ పతాకంలో తెలియని మత్తు ఉంటుంది. మాతృభూమి ఘనకీర్తిని అది తెలియజేస్తుంది. ఈ త్రివర్ణ పతాకాన్ని ప్రతిచోటా ఎగురవేస్తాం. హిందూస్థాన్ అనే గౌరవం ఎప్పటికీ నిలిచిపోతుంది. అందరికీ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" - వీరేంద్ర సెహ్వాగ్**

## మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు: ట్రేడింగ్‌పై వెంకటేశ్



గత ఐపీఎల్ సీజన్‌కు ముందు రిటెన్షన్ ప్రక్రియలో రూ.23.75 కోట్లకు వెంకటేశ్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ అట్టిపెట్టుకుంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో అతడి ఆటతీరు గొప్పగా ఏమీ లేదు. 142 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో అతడి ధరకు తగినంత న్యాయం చేయలేదనే విమర్శలూ వచ్చాయి. వచ్చే ఎడిషన్‌కు ముందు అతడిని ట్రేడింగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీసుకుంటుందనే వార్తలు వచ్చాయి. అందుకు బదులుగా ఇషాన్ కిషన్‌ను కేకేఆర్‌కు ఇస్తుందని అందులో పేర్కొన్నాయి. ఎందుకు ఎస్‌ఆర్‌హెచ్ అతడి వైపు మొగ్గు చూపిస్తుందనే కామెంట్లూ వచ్చాయి. ఈ క్రమంలో వెంకటేశ్ అయ్యర్ నోరు విప్పాడు. అవన్నీ అవాస్తవాలేనని కొట్టిపడేశాడు.

''నాకైతే ఇప్పటి వరకు అలాంటి సమాచారమే లేదు. కేకేఆర్ మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి స్పందన లేదు'' అని వెంకటేశ్ అయ్యర్ స్పష్టం చేశాడు.

వాటిని అస్సలు పట్టించుకోను

గత సీజన్‌లో పేలవమైన ప్రదర్శనతో వెంకటేశ్ అయ్యర్ విమర్శలు ఎదుర్కొన్నాడు. సోషల్ మీడియాలో అతడిపై మీమ్స్, కామెంట్లు వచ్చాయి. వాటిని తాను అస్సలు పట్టించుకోనని వెల్లడించాడు. ''నా గురించి అక్కడ ప్రశ్నించే వారంతా నా కాంటాక్ట్ లిస్ట్‌లో లేనివారే. కాబట్టి నేనెందుకు అలాంటి వాటి గురించి ఆలోచించాలి? ఇది నా జీవితం, నా గేమ్, నా కెరీర్. నాపై ఇంత ఖర్చు చేయాలని జట్టు భావించింది. మిగతావారి గురించి నాకెందుకు? ప్రతి ఒక్కరూ ఐపీఎల్‌లో ఆడాలని కోరుకుంటారు. ఒక్కోసారి రూ.20 లక్షలు కూడా పెద్ద అమౌంట్‌లా అనిపిస్తుంది. గత కొన్నేళ్లుగా నేను నేర్చుకున్న అంశాలు చాలా ఉన్నాయి. నేను మాత్రమే కాదు. మిగతా క్రికెటర్లూ ఇలాగే నేర్చుకుంటారు. ఎవరైతే నా వల్ల ప్రత్యక్షంగా ప్రభావితం అవుతారో వారికి మాత్రమే జవాబుదారీగా ఉంటా'' అని వెంకటేశ్ అయ్యర్ వ్యాఖ్యానించాడు.



## కరువానాకు గుకేశ్ షాక్

**సెయింట్ లూయిస్ (అమెరికా):** గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్ చివరి మూడు రౌండ్‌లలో రాణించాడు. ర్యాపిడ్ విభాగం పోటీలు ముగిశాక 10 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. లీనియర్ డొమింగెజ్ (అమెరికా)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 45 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఈ ఓటమి నుంచి వెంటనే కోలుకున్న గుకేశ్ ఎనిమిదో రౌండ్ గేమ్‌లో 45 ఎత్తుల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ వెస్లీ సో (అమెరికా)పై గెలిచాడు.

అనంతరం ప్రపంచ 6వ ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన చివరిదైన తొమ్మిదో గేమ్‌లో గుకేశ్ 89 ఎత్తుల్లో సంచలన విజయం సాధించాడు. క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 6వ స్థానంలో ఉన్న గుకేశ్... ర్యాపిడ్ ఫార్మాట్‌లో 27వ ర్యాంక్‌లో, బ్లిట్జ్ ఫార్మాట్‌లో 93వ ర్యాంక్‌లో ఉన్నాడు. ర్యాపిడ్ విభాగం గేమ్‌లు ముగియడంతో... ఇక బ్లిట్జ్ ఫార్మాట్‌లో 18 గేమ్‌లు జరుగుతాయి.

# అతడే భారత క్రికెట్‌లో రైజింగ్ స్టార్: రవిశాస్త్రి



భారత టెస్టు జట్టు సారథి శుభ్‌మన్ గిల్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఏకంగా 750+ పరుగులు చేసి అదరగొట్టాడు. కేవలం పాతికేళ్ల వయసులోనే జట్టు పగ్గాలను చేపట్టిన గిల్ క్లిష్టమైన తొలి సిరీస్‌ను డ్రాగా ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది జులై అవార్డునూ సొంతం చేసుకోవడం గమనార్హం. ఇప్పుడు మిగతా రెండు ఫార్మాట్ల నాయకత్వ పగ్గాలను అతడికే అప్పగించాలని బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈక్రమంలో భారత రైజింగ్ స్టార్‌గా గిల్‌ను అభివర్ణిస్తూ మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు.

''ఇప్పుడున్న యువ క్రికెటర్లంతా అద్భుతంగా ఆడుతున్నారు. అయితే, రైజింగ్ స్టార్ ఎవరు అని అడిగితే మాత్రం శుభ్‌మన్ గిల్ అని చెబుతా. అతడు సుదీర్ఘకాలం ఇలాగే ఆడేయగలడని నిరూపించాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో గిల్ ఆటను చూశాం. ఇప్పుడు అతడి వయసు కేవలం 25 ఏళ్లే. చాలా భవిష్యత్తు ఉంది. ఇప్పుడున్న అనుభవంతో ఇలాగే కొనసాగితే తిరుగుండదు. అతడి బ్యాటింగ్ చేసే తీరు చూస్తే అర్థమవుతుంది. అలవోకగా బంతిని ఆడేస్తున్నాడు. భారీ ఇన్నింగ్స్‌లు ఆడేంత సత్తా ఉంది'' అని రవిశాస్త్రి వెల్లడించాడు.

**ఆ రెండింట్లో కోహ్లీ బెస్ట్**

''బ్యాటర్‌గా కోహ్లీ అద్భుతాలు చేశాడు. అలాగే సారథిగానూ టీమ్ఇండియాను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాడు. ఐదేళ్లపాటు వరల్డ్ నంబర్ 1 జట్టుగా ఉందంటే అతడి పట్టుదలే కారణం. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లో అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నేను గుర్తించిన అద్భుత సారథుల్లో అతడు ఒకడు. కోహ్లీతో కలిసి జట్టును నడిపించే అవకాశం వచ్చింది. ధోనీ తర్వాత టీమ్ఇండియాను ముందుకుతీసుకెళ్లడంలో కోహ్లీదే కీలక పాత్ర. బ్యాటర్‌గానూ ఆధిపత్యం ప్రదర్శించాలని చూస్తాడు. ఐసీసీ టోర్నీల్లో విజేతగా నిలవనంత మాత్రాన బాధపడక్కర్లేదు. ఇక్కడ అదృష్టం కూడా కలిసి రావాల్సిన అవసరం ఉంది'' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. కోహ్లీ నాయకత్వంలో టీమ్ఇండియా ఉన్నతస్థాయికి దూసుకెళ్లినా.. ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవలేకపోవడం అతడి సారథ్య కెరీర్‌లో పెద్ద లోటు.

# అప్పుడు సచిన్ ఆపాడు..: సెహ్వాగ్





**ఓపెనర్‌గా ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే వీరేంద్ర సెహ్వాగ్ కూడా తన కెరీర్‌లో ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడ్డాడు. వన్డే ప్రపంచకప్ 2011 జట్టులో సభ్యుడైన అతడు.. అంతకు మూడేళ్లముందే 50 ఓవర్ల క్రికెట్ ఫార్మాట్ నుంచి వీడ్కోలు పలకాలని నిర్ణయం తీసుకున్నాడట. కానీ, క్రికెట్ దిగ్గజం, సహచర క్రికెటర్ సచిన్ సలహాతోనే ఆగిపోయినట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో సెహ్వాగ్ వెల్లడించాడు. లేకపోతే వరల్డ్ కప్ కల నెరవేరకుండానే మిగిలిపోయేదని వ్యాఖ్యానించాడు.**

"20072008లో ఆస్ట్రేలియా, శ్రీలంకతో ట్రై సిరీస్‌లో తొలి మూడు మ్యాచులు ఆడా. ఆ తర్వాత అప్పటి కెప్టెన్ ఎంఎస్ ధోనీ తుది జట్టులో నాకు అవకాశం ఇవ్వలేదు. ఫైనల్ టీమ్‌లో లేకపోతే ఇక వన్డేలు ఆడటం అనవసరమని భావించా. ఇదే విషయాన్ని సచిన్ దృష్టికి తీసుకెళ్లా. నేను వన్డేల నుంచి రిటైర్ కావాలని అనుకుంటున్నానని చెప్పా. అప్పుడు సచిన్ స్పందిస్తూ 'వద్దు. నేను కూడా 19992000 సీజన్‌లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నా. క్రికెట్‌ను వదిలేద్దామని భావించా. కానీ, ఆ దశ రావడం, వెళ్లిపోవడం జరిగిపోయాయి. ఇప్పుడు నువ్వు కూడా ఇదే ఫేజ్‌లో ఉన్నావు. అది కూడా వెళ్లిపోతుంది. ఎప్పుడు కూడా భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోకూడదు. మరో ఒకటి లేదా రెండు సిరీసులు వేచి చూడు. అప్పుడు ఓ నిర్ణయం తీసుకో' అని సూచించాడు. ఆ తర్వాత నా ఫామ్‌పై దృష్టిపెట్టా. వరల్డ్ కప్‌లో ఆడే అవకాశం దక్కించుకున్నా'' అని సెహ్వాగ్ గుర్తుచేశాడు. ధోనీ నాయకత్వంలోని వన్డే ప్రపంచ కప్ 2011లో భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. వన్డే కెరీర్‌లో సెహ్వాగ్ 251 మ్యాచుల్లో 8,273 పరుగులు చేశాడు. ఇందులో 15 సెంచరీలు, 38 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**మా అబ్బాయికి అదే చెప్పా**

2023 విజయ్ మర్చంట్ ట్రోఫీ స్క్వాడ్‌లో సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్‌కు చోటు దక్కింది. స్టార్ బ్యాటర్ కుమారుడిగా క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆర్యవీర్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. ఆ ఒత్తిడిని తట్టుకొనేందుకు ఆర్యకు సూచనలు ఇచ్చినట్లు సెహ్వాగ్ తెలిపాడు. ''క్రికెట్‌లో ఒత్తిడి అనేది సహజం. అయితే, దానిని ఎప్పుడూ మైండ్‌లోకి తీసుకోవద్దని ఆర్యకు చెప్పా. రంజీ ట్రోఫీ అయినా.. టీమ్ఇండియాకు ఆడేటప్పుడైనా ఇదే వర్తిస్తుంది'' అని భారత మాజీ డ్యాషింగ్ ఓపెనర్ వెల్లడించాడు.

# ఆసియా కప్.. టీ20 జట్టులో గిల్‌కు చోటు లేనట్లేనా?

**ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్లో నిర్వహించనున్నారు. అఫ్గానిస్థాన్, హాంకాంగ్ పోరుతో ఈ ట్రోఫీ ప్రారంభం కానుంది. టీమ్ఇండియా తన మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఆగస్టు 19 లేదా 20వ తేదీల్లో జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే ఇందులో శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కకపోవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.**



**సవ్యసాచిలా గిల్..**

టీమ్ఇండియా ఇటీవలే తెందూల్కర్ అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌లో పర్యటించింది. అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 22తో సమం చేసుకుంది. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ ఒకరి తర్వాత మరొకరు కొద్ది రోజుల వ్యవధిలో టెస్ట్ ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నియమితుడయ్యాడు. అతడి సారథ్యంలోనే భారతజట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించింది. గిల్.. సవ్యసాచిలా ఇటు కెప్టెన్‌గానూ, అటు బ్యాటర్‌గానూ ఈ సిరీస్‌లో రాణించాడు. 75.40 యావరేజ్‌తో 754 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలున్నాయి. ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో తొలి స్థానాన్ని అతడే సొంతం చేసుకున్నాడు. ఇక బర్మింగ్‌హామ్ టెస్టులో అయితే అతడు ఏకంగా భారీ డబుల్ సెంచరీ (269) సాధించాడు.

**ఆ ముగ్గురికీ అంతే!**

అలాగే యశస్వి జైస్వాల్‌కు కూడా మొండి చెయ్యి ఎదురయ్యే అవకాశాలున్నాయి. రెడ్ బాల్ క్రికెట్ మీద దృష్టి పెట్టమని అతడికి సెలెక్టర్లు సూచించినట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. అలాగే శ్రేయస్ అయ్యర్ , కేఎల్ రాహుల్‌కు కూడా ఈ సారి టీ20 టీమ్‌లో స్థానం దక్కకపోవచ్చు. ఏది ఏమైనా మరి కొన్ని రోజులు ఆగితే కానీ.. ఆసియాకప్‌లో పాల్గొనబోయే భారత జట్టు విషయంలో స్పష్టత వచ్చే అవకాశం లేదు.







**మొగ్గు చూపని సెలెక్టర్లు!**

ఇంగ్లాండ్ సిరీస్‌లో గిల్ అద్భుతంగా రాణించినప్పటికీ.. ఆసియాకప్‌లో మాత్రం అతడికి ఆడే అవకాశం దక్కకపోవచ్చని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో రాణిస్తున్న టీమ్ఇండియా టీ20 జట్టులో పెద్దగా ప్రయోగాలు చేయడానికి బీసీసీఐ సెలెక్టర్లు మొగ్గు చూపడం లేదని సమాచారం. టీ20 ఫార్మాట్లో సంజు శాంసన్ , అభిషేక్ శర్మ ఓపెనర్లుగా కుదురుకున్నారు. వీరి జోడీ చక్కగా రాణిస్తోంది. దీంతో సెలెక్టర్లు ఓపెనర్లను మార్చే సాహసం చేయడానికి పూనుకోవడం లేదని తెలుస్తోంది. మిడిలార్డర్‌లోనూ తీవ్రమైన పోటీ ఉంది. దీంతో శుభ్‌మన్ గిల్‌కు టీ20 జట్టులో స్థానం లభించే అవకాశం కనిపించడం లేదు.